నేటినిజం
తెలుగు దినపత్రిక
website:www.netinijam.com
E-mail : netinijam93@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 30-9-2022 RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 51 పేజీలు:6 వెల: రూ.1/-

## మూడు రోజులు భారీ వర్షాలు.. హెచ్చరించిన వాతావరణశాఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 29: రాగల మూడు రోజుల్లో రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఇవాళ్టి నుంచి రేపటి వరకు నల్గొండ, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురుస్తాయంటూ ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. కొమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ, సిద్ధిపేట, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది. పలు జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడే అవకాశం ఉందని వివరించింది. అక్టోబర్ 1న రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల, జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. అక్టోబర్ 2న పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో వానలు పడే అవకాశం ఉందని వాతావరణ కేంద్రం వివరించింది.

## పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై స్టడీ చేయించాల్సిందే : రజత్ కుమార్



హైదరాబాద్, సెప్టెంబర్ 29: పోలవరం బ్యాక్ వాటర్ ప్రభావంపై థర్డ్ పార్టీ స్టడీ చేయించాల్సిందేనని రాష్ట్ర సాగునీటి పారుదల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ డిమాండ్ చేశారు. ముంపు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. కేంద్ర జల్ శక్తి శాఖ ఆధ్వర్యంలో తెలంగాణ, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు సంబంధించిన సాగునీటి పారుదల శాఖల అధికారులతో జరిగిన సమావేశంలో రజత్ కుమార్ ఈ డిమాండ్ చేశారు.

ముంపు సమస్యలపై రజత్ కుమార్ బలంగా వాదనలు వినిపించారు. ప్రాజెక్టు నిర్మాణంలో అనేక మార్పులు జరిగాయని, ఆ మేరకు ముంపు సమస్య కూడా తీవ్రం కానుందని నొక్కిచెప్పారు. అంచనాకు మించి ముంపు వాటిల్లనుందని గణాంకాలతో సహా వివరించారు. చారిత్రక ప్రదేశాలు, పవర్ ప్లాంట్ ముంపునకు గురయ్యే అవకాశం ఉందని తెలిపారు.

ఇక సమావేశంలో పాల్గొన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్ సైతం అదే వాదనలను వినిపించాయి. తమ రాష్ట్రాల్లో ఇప్పటికీ ఎలాంటి ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టలేదని అభ్యంతరం వ్యక్తం చేశాయి. ఎట్టి పరిస్థితుల్లోనూ పోలవరం ప్రాజెక్టు ఎత్తు తగ్గించాల్సిందేనని పట్టుబట్టాయి. అదే విధంగా ముంపు నివారణకు రక్షణ చర్యలు సత్వరమే చేపట్టాలని డిమాండ్ చేశారు. అన్ని రాష్ట్రాల వాదనలు విన్న తరువాత మరోసారి వచ్చేనెల 7న సమావేశన్ని నిర్వహించాలని జల్ శక్తిశాఖ నిర్ణయించింది.

## అరణ్య భవన్‌లో ఘనంగా బతుకమ్మ సంబరాలు



హైదరాబాద్, సెప్టెంబర్ 29: తెలంగాణ పూల జాతర బతుకమ్మ పండుగ సంబురాలను అరణ్య భవన్‌లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అటవీ శాఖ అధికారిణులు, సిబ్బంది ఉత్సాహంగా సంబురాల్లో పాల్గొన్నారు. బతుకమ్మ పాటలకు లయబద్ధంగా నాట్యం చేస్తూ అలరించారు. అలాగే మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి, పీసీసీఎఫ్ ఆర్.ఎం.డొబ్రియల్, ఇతర అధికారులు కూడా వారితో ఆడి పాడారు. ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఎస్పీ అధ్యక్షుడిగా అఖిలేష్ యాదవ్ ఎన్నిక

హైదరాబాద్, సెప్టెంబర్ 29: సమాజ్‌వాదీ పార్టీ అధ్యక్షుడిగా అఖిలేష్ యాదవ్ మరోసారి ఎన్నికయ్యారు. లక్నోలో జరిగిన పార్టీ జాతీయ సదస్సులో ఈ విషయాన్ని ప్రకటించారు. 2017 నుంచి పార్టీ అధినేతగా కొనసాగుతూ వస్తున్న అఖిలేష్.. అంతకు ముందు 2012 నుంచి 2017 వరకు రాష్ట్ర ముఖ్యమంత్రిగా సైతం పని చేయనున్నారు. వరుసగా మూడోసారి అఖిలేష్ పార్టీ పగ్గాలు చేపట్టబోతున్నారు. 2017కి ముందు ఆయన తండ్రి, పార్టీ వ్యవస్థాపకుడు ములాయం సింగ్ యాదవ్ అధ్యక్షుడిగా పని చేశారు.

సమాజ్‌వాదీ పార్టీని 1992లో స్థాపించగా.. అఖిలేష్ యాదవ్ 2000 సంవత్సరంలో రాజకీయరంగ ప్రవేశం చేశారు. తొలిసారిగా కన్నౌజ్ నుంచి పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికయ్యారు. ఆ తర్వాత 2004, 2009లో కూడా ఎంపీగా ఎన్నికయ్యారు. 2012లో సమాజ్‌వాదీ పార్టీకి పూర్తి మెజారిటీ రావడంతో ములాయం సింగ్ యాదవ్ తన కుమారుడు అఖిలేష్ యాదవ్‌ను ముఖ్యమంత్రిని చేశారు. అప్పటి నుంచి పార్టీలో చీలిక మొదలైంది. 2017లో, అఖిలేష్ తన తండ్రిని జాతీయ అధ్యక్ష పదవి నుంచి తొలగించి, పార్టీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. మేనమామ శివపాల్ సింగ్ యాదవ్‌ను సైతం రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ శివరాజు – జోధపూరుకు
యువరాజుగ చెలగి చెలగి యోచన తోడన్
ప్రవిమల మగు 'పోలో' తో
నవపథమందించి నాడు నట శక్తి గానుచున్ !!

(సెప్టెంబర్ 30 పోలో వీరుడు శివరాజ్‌సింగ్ జననం..)



–రాధశ్రీ
సెల్:9494481210

## స్మార్ట్ మ్యాను ఫ్యాక్టరింగ్ కోసం యువతకు శిక్షణ ఇవ్వాలి : మంత్రి కేటీఆర్




హైదరాబాద్, సెప్టెంబర్ 29: స్మార్ట్ మ్యానుఫ్యాక్టరింగ్ కోసం ప్రభుత్వంతో కలిసి స్థానిక యువతకు శిక్షణ ఇవ్వాలని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ప్రముఖ ఫ్రెంచ్ కంపెనీ ష్నీడర్ ఎలక్ట్రిక్ కంపెనీని కోరారు. రూ. 300 కోట్లతో హైదరాబాద్ సమీపం లోని జీఎంఆర్ ఇండస్ట్రీయల్ పార్కు వద్ద ఏర్పాటు కానున్న ష్నీడర్ ఎలక్ట్రిక్ కంపెనీ కొత్త స్మార్ట్ ఫ్యాక్టరీ శంకుస్థాపన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ శంకుస్థాపన కార్యక్రమానికి ఐటీ మంత్రి కేటీఆర్ హాజరై భూమిపూజ చేశారు.

ఈ సందర్భంగా మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ.. దేశంలోనే అతిపెద్ద ఫ్యాక్టరీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. స్మార్ట్ మ్యనుఫ్యాక్టరింగ్‌లో స్థానిక యువతకు శిక్షణ ఇస్తే ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఒకే రోజు హైదరాబాద్‌లో మూడు ఫ్రెంచ్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఇది సంతోషించే విషయమని పేర్కొన్నారు. మరిన్ని ఫ్రెంచ్ సంస్థలు హైదరాబాద్ వ్యాపార కార్యకలాపాలు ప్రారంభించాలని కేటీఆర్ కోరారు. 75 శాతం ష్నీడర్ ఉత్పత్తులు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయని తెలిపారు. ఏడాది లోపే సంస్థ తన నూతన ఫ్యాక్టరీని ప్రారంభించనుందని పేర్కొన్నారు.

## కేంద్రమంత్రులపై హరీశ్‌రావు ఫైర్



హైదరాబాద్, సెప్టెంబర్ 29: కేంద్ర మంత్రులపై రాష్ట్ర వైద్యారోగ్య, ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. తెలంగాణ ప్రభుత్వ పథకాలపై కేంద్ర మంత్రులు ఢిల్లీలో ప్రశంసలు గుప్పించి.. గల్లీల్లో మాత్రం విమర్శలు చేయడం సరికాదన్నారు. ఒక వైపు అవార్డులు ఇస్తూనే.. మరో వైపు అవినీతి జరిగిందని కేంద్ర మంత్రులు అనడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు. పార్లమెంట్ సాక్షిగా అవార్డులు ఇస్తూ.. గల్లీలో రాజకీయ విమర్శలు చేయడమేంటని ప్రశ్నించారు. కేంద్రానికి దమ్ముంటే పథకాలకు నిధులు ఇచ్చి వాటా గురించి మాట్లాడాలన్నారు. 15వ ఆర్థిక కమిషన్ ఇచ్చిన నివేదికలను కేంద్రం తుంగలో తొక్కిందని మండిపడ్డారు. రాజకీయాలు చేయాలనుకుంటే నిధులు ఇచ్చి మాట్లాడాలి.. విమర్శలు చేయడం సరికాదన్నారు. ఎర్రమంజిల్‌లోని మిషన్ భగీరథ ఆఫీసులో మంత్రి హరీశ్‌రావు, మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో కలిసి మీడియాతో మాట్లాడారు.

మిషన్ భగీరథ పథకానికి జాతీయ అవార్డు రావడం సంతోషంగా ఉందని మంత్రి హరీశ్‌రావు పేర్కొన్నారు. గత ప్రభుత్వాల కాలంలో సర్పంచ్‌లు బోర్లు రిపేర్ చేయడానికే పరిమితం అయ్యేవారని గుర్తు చేశారు. ఎనిమిదేండ్ల టీఆర్ఎస్ పాలనలో నీళ్లు, కరెంట్ సమస్యలు లేవన్నారు. పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, మోకాళ్ల యాత్రలు చేస్తున్న నాయకులకు తెలంగాణ ప్రజలు బుద్ధి చెబుతారన్నారు. క్వాలిటీ, క్వాంటిటీ, రెగ్యులారిటీ తెలంగాణ ప్రత్యేకత అని చెప్పుకొచ్చారు. దేశమంతా తెలంగాణ మోడల్ వైపు చూస్తోందన్నారు. మిషన్ భగీరథ పథకం దేశమంతటా ఆదర్శంగా నిలిచిందని స్పష్టం చేశారు. దేశంలో ఇంకా ఇప్పటికీ 50 శాతం మంది ప్రజలకు తాగునీరు అందడం లేదని పేర్కొన్నారు. వందకు వందశాతం త్రాగునీరు అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమే అని ఉద్ఘాటించారు. 2014 వరకు 5 వేల 6 వందల కుటుంబాలకు నీళ్లు వస్తే.. ఇప్పుడు 23 వేల 9 వందల ఇండ్లకు సురక్షిత మంచినీరు అందుతుందన్నారు.

## ప్రతిభ ఏ ఒక్కరి సొంతం కాదు : మంత్రి సబితా ఇంద్రారెడ్డి




హైదరాబాద్, సెప్టెంబర్ 29: ప్రతిభ ఏ ఒక్కరి సొంతం కాదని, కార్పొరేట్ విద్యా సంస్థలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తున్నారని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు. గురువులు చెప్పిన విషయాలను అనుసరించి సమయాన్ని వృధా చేయకుండా చదివితే విజేతలుగా నిలుస్తారని ప్రభుత్వ జూనియర్ కళాశాలల విద్యార్థులు నిరూపించారని మంత్రి అన్నారు.

ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో అత్యధిక మార్కులను సాధించిన విద్యార్థులను గురువారం నగరంలోని ఎస్‌సీఈఆర్‌టీ గోదావరి ఆడిటోరియంలో మంత్రి సబిత సన్మానించారు.

ఈ సందర్భంగా మంత్రి సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మెరుగైన విద్యను అందించడం వల్లే ఉత్తమ ఫలితాలు లభిస్తున్నాయని, ప్రయివేట్ కళాశాలలకు ధీటుగా పూర్తి స్థాయిలో విద్యార్థులకు సదుపాయాలను కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ఉత్తీర్ణతా శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వార్షిక పరీక్షలకు ముందునుండే సిద్ధం చేస్తున్నామని, అవసరమైతే ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నామని వెల్లడించారు. రాష్ట్రంలో ఆదివాసి ఖిల్లాగా పేరున్న కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా విద్యార్థులు ఇంటర్ ఫలితాల్లో మెరుగైన ఉత్తీర్ణత సాధించడం ప్రశంశనీయమని పేర్కొన్నారు.

జూనియర్ కళాశాలల్లో విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురికాకుండా ప్రత్యేకంగా సైకాలజిస్టులతో సలహాలను ఇప్పిస్తున్నామని మంత్రి తెలిపారు. ఐఐటీ, నీట్ ప్రవేశాల కోసం ఇంటర్మీడియట్ బోర్డు ఇచ్చిన శిక్షణ కూడా సత్ఫలితాలను సాధించిందని మంత్రి తెలిపారు. పరీక్షలు సమీపించిన సమయంలో ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని, విద్యార్థులను గ్రూప్‌లుగా విభజించి వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు మంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెరుగైన ఫలితాలను సాధించేందుకు ఇప్పటినుంచే చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఇంటర్మీడియట్ బోర్డు కార్యదర్శి ఉమర్ జలీల్, అత్యున్నత మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

## నితిన్ గడ్కరీ కీలక ప్రకటన - ఇకపై ప్రతి కారులో ఆరు ఎయిర్ బ్యాగులు తప్పని సరి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: కేంద్ర రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ కీలక ప్రకటన చేశారు. ఇకపై ప్రతి కారులో కనీసం 6 ఎయిర్ బ్యాగులు ఉండాల్సిందేనని తెలిపారు. ప్రయాణికుల భద్రత దృష్ట్యా ఈ కీలక నిర్ణయం తీసుకున్నట్లుగా ఆయన ప్రకటించారు. కార్ల వేరియంట్లు, ధరలతో ఏమాత్రం సంబంధం లేకుండా ప్రతి కారులో కనీసం 6 ఎయిర్ బ్యాగులు ఉండాల్సిందేనని ఆయన స్పష్టం చేశారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో టాటా సన్స్ మాజీ చైర్మన్ సైరస్ మిస్త్రీ ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. ప్రమాద సమయంలో కారు వెనుక సీట్లో కూర్చున్నా మిస్త్రీ చనిపోయారు. ఈ ప్రమాదంపై సమగ్ర అధ్యయనం చేసిన కేంద్ర ప్రభుత్వంఇకపై జరిగే ప్రమాదాల్లో ముందు సీట్లలో కూర్చున్న వారే కాకుండా వెనుక సీట్లలో కూర్చున్న వారు కూడా సురక్షితంగా ఉండాలన్న ఉద్దేశ్యంతోనే ఈ సరికొత్త నిబంధనను అమలులోకి తీసుకువచ్చింది. ఇకపై ప్రతి కారులో 6 ఎయిర్ బ్యాగులు ఉండేలా కేంద్ర ప్రభుత్వం కఠిన నిబంధనను అమలులోకి తీసుకొస్తోంది. అక్టోబర్ 1 నుంచే ఈ నిబంధనను అమలులోకి తీసుకురానుంది.

## ఉపాధి హామీ కనీస వేతనం రూ.240లు అందాలి- సీఎం జగన్

అమరావతి, సెప్టెంబర్ 29: ఉపాధి హామీ కింద కనీస వేతనం రూ.240లు అందేలా చూడాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అన్నారు. స్పందనపై తాడేపల్లిలో నిర్వహించిన సమీక్షలో సీఎం జగన్ మాట్లాడుతూ నెలరోజుల్లో గ్రామ, వార్డు సచివాలయాల్లో ప్రాధాన్యత పనులు చేయాలన్నారు. ఎస్ డీజీ లక్ష్యాలే కలెక్టర్ల పనితీరుకు ప్రామాణికమన్నారు. 2022 డిసెంబర్ నాటికి 5లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తి కావాలన్నారు. 3.5లక్షల జగనన్న కాలనీలు, 1.5లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే ఫిర్యాదుల పరిష్కారానికి ఫీల్డ్ విజిట్ తప్పనిసరని అన్నారు.

## నీతి ఆయోగ్ సిఫారసులను గౌరవించండి.. కేంద్రానికి కేటీఆర్ విజ్ఞప్తి

హైదరాబాద్, సెప్టెంబర్ 29: తెలంగాణ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకం మిషన్ భగీరథకు జాతీయ అవార్డు రావడంపై రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ హర్షం వ్యక్తం చేశారు. అన్ని గ్రామీణ ఆవాసాలకు సురక్షిత తాగునీరు సరఫరా చేస్తున్నందుకు గాను ఈ అవార్డు రావడం పట్ల సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రాన్ని గుర్తించిన కేంద్రానికి మంత్రి కేటీఆర్ ధన్యవాదాలు తెలిపారు. రూ. 19 వేల కోట్లు ఇవ్వాలన్న నీతి ఆయోగ్ సిఫార్సులను కేంద్రం గౌరవించాలని కేటీఆర్ విజ్ఞప్తి చేశారు.

## సూపర్‌స్టార్ కృష్ణ, మహేశ్‌బాబును పరామర్శించిన మంత్రి తలసాని



హైదరాబాద్, సెప్టెంబర్ 29: సూపర్‌స్టార్ కృష్ణ, ప్రిన్స్ మహేశ్‌బాబును సినిమాటోగ్రఫీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఇవాళ పరామర్శించారు. ఇందిరాదేవి చిత్రపటానికి మంత్రి తలసాని పుష్పాంజలి ఘటించారు. మహేశ్‌బాబు మాతృమూర్తి ఇందిరా దేవి నిన్న మృతి చెందిన సంగతి తెలిసిందే. గత కొంతకాలం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న ఇందిరాదేవి.. నిన్న తెల్లవారుజామున ఫిల్మ్ నగర్‌లోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు.

## మంత్రి ఎర్రబెల్లికి ప్రశంసల వెల్లువ..



హైదరాబాద్, సెప్టెంబర్ 29: పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. పల్లెప్రగతి, మిషన్ భగీరథ వంటి పథకాలు దేశంలోనే నెంబర్ వన్‌గా నిలిచాయి. ఈ నేపథ్యంలో మంత్రి ఎర్రబెల్లిని సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, సత్యవతి అభినందించారు.

కాగా, మంత్రి ఎర్రబెల్లిని మంత్రులు కేటీఆర్, సత్యవతి రాథోడ్ గురువారం సన్మానించారు. రాష్ట్రంలోని అన్ని గ్రామాల్లో ఇంటింటికి నల్లాల ద్వారా శుద్ధి చేసిన మంచి నీటిని అందించడంలో అత్యుత్తమ ప్రతిభ కనబరాచారు. దీంతో రెగ్యులారిటీ కేటగిరీలో తెలంగాణ దేశంలోనే నెంబర్ వన్ గా నిలవడమేగాక, స్వచ్ఛ సర్వేక్షణ్‌లో దేశంలోనే అత్యుత్తమ ప్రతిభ కనబరచి దేశంలో నెంబర్ వనగ్ నిలిచి వివిధ కేటగిరీలలో మరో 13 అవార్డులను గెలుచుకున్నది.

ఈ సందర్భంగా వారు మంత్రి ఎర్రబెల్లిని శాలువాతో సత్కరించి, పూల మొక్క బహూకరించారు. గురువారం ప్రగతి భవన్ లోని తన కార్యాలయంలో మంత్రి ఎర్రబెల్లికి కేటీఆర్ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ..సీఎం కేసీఆర్ మేధో మథనం నుంచి పుట్టుకు వచ్చిందే పల్లె ప్రగతి కార్యక్రమం.

ఆ కార్యక్రమాన్ని కేసీఆర్ ఆశయాలు, ఆలోచనలకు అనుగుణంగా పకడ్బందీగా అమలు చేస్తూ మంత్రి ఎర్రబెల్లి ఆయన టీమ్, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, కార్యదర్శులు, సిబ్బంది, ప్రజల భాగస్వామ్యంతో అద్భుతంగా సాధించిన ఫలితంగానే ఈ అవార్డులు, రివార్డులు అని అన్నారు.

దేశంలో మరే రాష్ట్రం సాధించన విధంగా తెలంగాణ రాష్ట్రం అందునా పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ సాధిస్తున్న ఫలితాలు తెలంగాణకే గాక, మొత్తం దేశానికే గర్వకారణం అన్నారు. ఈ ఫలితాలతో రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నదని ప్రశంసించారు.

మరింత బాధ్యతాయుతంగా పని చేసి, మరిన్ని ఆవార్డులు తేవాలన్నారు. రాష్ట్రానికి మంచి పేరు తెస్తూ దేశానికి ఇదే విధంగా ఆదర్శంగా నిలవాలని కేటీఆర్ ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, అరూరి రమేశ్ తదితరులు ఉన్నారు.

## దుర్గామాత అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ కవిత



హైదరాబాద్, సెప్టెంబర్ 29: ముషీరాబాద్ నియోజకవర్గం గాంధీ నగర్‌లోని దుర్గామాత అమ్మవారిని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత సందర్శించారు. దసరా నవరాత్రుల సందర్భంగా దుర్గామాత అమ్మవారికి కవిత ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఆశీర్వాదాలు అందరికీ ఎల్లప్పుడు ఉండాలని ఆకాంక్షించారు. ఈ పూజా కార్యక్రమంలో ముషీరాబాద్ టీఆర్ఎస్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, పలువురు కార్పొరేటర్లు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఐఎన్ఎస్ సునయన సీషెల్స్‌లో కంబైన్డ్ మారిటైమ్ ఫోర్సెస్ (సీఎంఎఫ్) కసరత్తు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: ఐఎన్ఎస్ సునయన 24-27 సెప్టెంబర్ 22 వరకు సీషెల్స్‌లో కంబైన్డ్ మారిటైమ్ ఫోర్సెస్ (సీఎంఎఫ్) నిర్వహించిన కెపాసిటీ బిల్డింగ్ ఎక్సర్‌సైజ్ ఆపరేషన్ సదరన్ రెడినెస్‌లో పాల్గొంది. యూఎస్ నేవీసెంట్రల్ వైస్ అడ్మిరల్ బ్రాడ్ కూపర్ ద్వారా భారత నావికాదళం సీఎంఎఫ్‌ను స్వాగతం పలికింది. సీఎంఎఫ్ కసరత్తులో భారత నౌకాదళ నౌక పాల్గొనడం ఇదే తొలిసారి. పాల్గొనే దేశాల ప్రతినిధులు హాజరయ్యే ఇంటరాక్టివ్ సెషన్‌లలో భాగంగా, ఇండియన్ నేవీ మారిటైమ్ డొమైన్ అవేర్‌నెస్‌పై శిక్షణ ఉపన్యాసం ఇచ్చింది. విజిట్ బోర్డ్ సెర్చ్ ఉ సీజర్ (వీబీఎస్‌ఎస్) కార్యకలాపాలపై ప్రత్యేక ప్రదర్శన కూడా సీషెల్స్ స్పెషల్ ఫోర్స్ నేతృత్వంలోని హెచ్ఎంఎస్ మాంట్రోస్‌లో ఇండియన్ నేవల్ టీమ్ ద్వారా మద్దతుతో నిర్వహించడం జరిగింది. విశిష్ట సందర్శకుల ప్రదర్శనలో భాగంగా ఈ కార్యక్రమం సమన్వయం చేశారు. రిపబ్లిక్ ఆఫ్ సీషెల్స్ అధ్యక్షుడు వేవెల్ రామ్‌కలవాన్ సీఎంఎఫ్ సభ్య దేశాల సీనియర్ అధికారులు సాక్షులుగా ఉన్నారు. సంయుక్త విన్యాసాల్లో భారత నౌకాదళం పాల్గొనడం అభినందనీయమన్నారు.

## అభివృద్ధి పథంలో దూసుకుపోతున్న తెలంగాణ : మంత్రి గంగుల



కరీంనగర్, సెప్టెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందని, రజకులపట్ల గత ప్రభుత్వాలు వివక్ష చూపించాయని మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ 4వ డివిజన్ లో రూ.2 కోట్లతో నిర్మించనున్న అత్యాధునిక దోభీఘాట్ నిర్మాణ పనులను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి గంగుల మాట్లాడుతూ.. గతంలో బట్టలు ఉతకాలంటే ఇబ్బందులు పడాల్సి వచ్చేదని, స్వయం పాలనలో రజకుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. దొరల అరాచకానికి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మను గత పాలకులు పట్టించుకోలేదు కానీ, తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చాకలి ఐలమ్మను గుర్తించి.. జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. అభివృద్ధి చెందిన తెలంగాణలో పాత పాలకులు అధికారంలోకి వస్తే మళ్లీ గుడ్డిదీపం పెట్టుకోవాల్సిన రోజులొస్తాయని అన్నారు. టీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అన్నారు. రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉందామన్నారు.

## భారత ఫుట్ బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రి డాక్యుమెంటరీ-అభినందించిన ప్రధాని




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: కెప్టెన్ ఫెంటాస్టిక్ పేరుతో భారత ఫుట్ బాల్ జట్టు కెప్టెన్ సునీల్ ఛెత్రిపై డాక్యుమెంటరీ రూపొందనుంది. అతని జీవితం, కెరీర్‌పై ప్రపంచ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) ప్రత్యేక డాక్యుమెంటరీని రూపొందించింది. మూడు ఎపిసోడ్‌ల ఈ డాక్యుమెంటరీని తాజాగా విడుదల చేసింది. ఆటగాడిగా ఛెత్రి సాధించిన విజయాలతో పాటు భారత జట్టులోకి రావడానికి అతను పడిన కష్టాలను కళ్లకు కట్టింది. 'కెప్టెన్ ఫెంటాస్టిక్' పేరుతో రూపొందించిన ఈ డాక్యుమెంటరీ తన అధికారిక స్ట్రీమింగ్ ఫ్లాట్ ఫామ్ అయిన ఫిఫా లో అందుబాటులో ఉంచింది. 'దిగ్గజ ఫుట్ బాటర్లు క్రిస్టియానో రొనాల్డో, లియోనల్ మెస్సీ గురించి మీ అందరికీ తెలుసు. ఇప్పుడు అత్యధిక అంతర్జాతీయ గోల్స్ సాధించిన మూడో ఆటగాడి గురించి కూడా తెలుసుకోండి' అని ఫిఫా పేర్కొన్నది.సాధారణంగా ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన ఆటగాళ్ల గురించి ఫిఫా ఇలాంటి డాక్యుమెంటరీలు చేస్తుంటుంది. ఛెత్రిపై ఇలాంటి ఎడిసోడ్ చేసిందంటే అది చాలా గొప్ప విషయం. ఇది ఛెత్రితో పాటు భారత ఫుట్‌బాల్ కు కూడా గర్వకారణం అనొచ్చు. దీనిపై ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పందించారు. ఛెత్రిని అభినందించిన మోదీ.. భారత్ లో ఫుట్ బాల్ మరింతగా ప్రాచుర్యం చెందేందుకు ఇది దోహదపడుతుందని ట్వీట్ చేశారు.

## నెల్లూరులో రూ.46 లక్షల విలువైన గుట్కా పట్టివేత

నెల్లూరు, సెప్టెంబర్ 29: గుట్టుచప్పుడు కాకుండా రవాణా చేస్తున్న గుట్కాతో పాటు ఇంపోర్టెడ్ సిగరెట్లను నెల్లూరు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) అధికారులు పట్టుకున్నారు. వీటి విలువ దాదాపు రూ.46 లక్షల వరకు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్న ఎస్ఈబీ అధికారులు వారిని లోతుగా విచారిస్తున్నారు.

కచ్చితమైన సమాచారం మేరకు.. కందుకూరు సబ్‌డివిజన్‌లోని గుడ్లూరులోని రెండు గోదాంలపై ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. రూ.46 లక్షల విలువైన 128 బస్తాల నిషేధిత గుట్కా ప్యాకెట్లు, ప్యారిస్‌లో తయారైన వివిధ రకాల దిగుమతి చేసుకున్న 400 సిగరెట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

ఈ దాడుల్లో తెట్టు గ్రామానికి చెందిన తిరుమలరాజు వెంకటేశ్వర్లు, కందుకూరు పట్టణానికి చెందిన బయ్యా సుధాకర్‌లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కందుకూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ హెచ్ఎస్ హుస్సేన్‌బాషా, ఎస్ఈబీ సిబ్బంది సబ్ ఇన్‌స్పెక్టర్ జీ బాలకృష్ణ నేతృత్వంలోని బృందం గుడ్లూరు మండలం తెట్టు, కందుకూరు రూరల్ మండలం ఓగూరులో ఉన్న రెండు గోదాంలపై దాడులు నిర్వహించినట్లు ఎస్పీ సీహెచ్ విజయరావు తెలిపారు.

ఎలాంటి లైసెన్స్ లేకుండా పొగాకు ఉత్పత్తులు, సిగరెట్లను దిగుమతి చేసుకున్నట్లు గుర్తించిన ఎస్ఈబీ బృందం వెంకటేశ్వర్లు, సుధాకర్‌లను అదుపులోకి తీసుకున్నారు. గతంలో గుడ్లూరు పోలీస్ స్టేషన్‌లో వెంకటేశ్వర్లుపై సస్పెక్ట్ షీట్ తెరవగా, అతనిపై పోలీస్ స్టేషన్ పరిధిలో 5 కేసులు నమోదయ్యాయి. సుధాకర్‌పై గతంలో సింగరాయకొండ, కందుకూరు పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో 6 సీఓటీపీఏ కేసులు నమోదయ్యాయి. స్వాధీనం చేసుకున్న గుట్కా విలువ దాదాపు రూ.46 లక్షల వరకు ఉంటుందని, కర్ణాటకలోని తుంకూరు నుంచి తీసుకువచ్చి ఏపీలో అధిక ధరలకు గుట్కా విక్రయిస్తున్నట్లు ఎస్పీ విజయరావు తెలిపారు. నిషేధిత పొగాకు ఉత్పత్తుల అక్రమ వ్యాపారం, రవాణాపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పొటాష్ సరఫరా సంస్థల్లో ఒకటైన కెనడాలోని కాన్ పోటెక్స్‌తో అవగాహనా ఒప్పందం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: రైతు సమాజానికి దీర్ఘకాలిక ఎరువుల లభ్యతను నిర్ధారించే దిశగా చేపట్టిన ఒక ముఖ్యమైన చర్యగా, భారతీయ ఎరువుల కంపెనీలైన – కోరమాండల్ ఇంటర్నేషనల్, చంబల్ ఫెర్టిలైజర్స్, ఇండియన్ పొటాష్ లిమిటెడ్ సంస్థలు 2022 సెప్టెంబర్, 27వ తేదీన కెనడాకు చెందిన కాన్ పోటెక్స్ తో ఒక అవగాహన ఒప్పందాన్ని కుదుర్చుకున్నాయి. ఈ అవగాహన ఒప్పందాన్ని ఈరోజు ఇక్కడ కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ కు అందించారు.

ప్రపంచవ్యాప్తంగా అతిపెద్ద పొటాష్ సరఫరా సంస్థల్లో ఒకటైన కెనడాలోని కాన్ పోటెక్స్ కంపెనీ, సంవత్సరానికి 130 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని ఎగుమతి చేస్తుంది.

భారతీయ రైతులకు ఎం.ఓ.పి. (మ్యూరియేట్–ఆఫ్–పొటాష్) సరఫరా కోసం కంపెనీల మధ్య దీర్ఘకాలిక ఒప్పందాలు కుదుర్చుకోవడం పట్ల కేంద్ర రసాయనాలు, ఎరువుల శాఖ మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

దీనిని ఒక మార్గ నిర్దేశిత చర్యగా డాక్టర్ మన్సుఖ్ మాండవీయ పేర్కొంటూ, "ఎమ్.ఓ.యు సరఫరా మరియు ధరల అస్థిరత రెండింటినీ తగ్గిస్తుంది; భారతదేశానికి పొటాష్ ఎరువుల స్థిరమైన దీర్ఘకాలిక సరఫరాను నిర్ధారిస్తుంది. వనరులు భారీగా ఉన్న దేశాలతో దీర్ఘకాలిక భాగస్వామ్యాల ద్వారా సరఫరా అనుసంధానం కోసం దేశీయ ఎరువుల పరిశ్రమను భారత ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ముడిసరుకు తో పాటు, ఎరువుల ఖనిజాల దిగుమతులపై భారతదేశం ఎక్కువగా ఆధారపడుతున్నందున, ఈ భాగస్వామ్యాలు నిర్దిష్ట కాల వ్యవధిలో ఎరువులు, ముడి పదార్థాల సురక్షితమైన లభ్యతను అందిస్తాయి. అదేవిధంగా, అస్థిర మార్కెట్ పరిస్థితులలో ధర స్థిరత్వాన్ని కూడా అందిస్తాయి.

కాన్ పోటెక్స్, కెనడా అవగాహన ఒప్పందంలో భాగంగా భారతీయ ఎరువుల కంపెనీలకు 3 సంవత్సరాల కాలానికి ఏటా 15 లక్షల మెట్రిక్ టన్నుల పొటాష్‌ను సరఫరా చేస్తుంది. ఈ సరఫరా భాగస్వామ్యం దేశంలో ఎరువుల లభ్యతను మెరుగుపరచడం తో పాటు, సరఫరా, ధరల దుర్బలత్వాన్ని తగ్గించగలదని భావిస్తున్నారు." అని కూడా ఆయన తెలియజేశారు.

రాబోయే పంటల సీజన్ కు ముందు ఎం.వో.యూ. ప్రాముఖ్యతను అర్థం చేసుకున్న డాక్టర్ మాండవీయ, "రైతు వర్గాలకు ఎం.ఓ.పి. లభ్యతను మెరుగుపరుస్తుంది, వారి సంక్షేమాన్ని సమర్థిస్తుంది, దేశంలో ఆహార భద్రతను నిర్ధారించడంలో దోహదపడుతుంది కాబట్టి ఇది ఒక ముఖ్యమైన చొరవ" అని పేర్కొన్నారు. "మన పరస్పర సంబంధాలను బలోపేతం చేయడానికి, రెండు దేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరచడానికి" ఈ అవగాహన ఒప్పందం దోహదపడుతుందని కూడా ఆయన చెప్పారు.

రష్యా, ఇజ్రాయెల్ వంటి దేశాలతో పొటాష్ తో సహా ఇతర ఎరువుల కోసం దీర్ఘకాలిక అవగాహన ఒప్పందాలు చేసుకోవడం కోసం భారత ప్రభుత్వం కృషి చేస్తున్నట్లు, డాక్టర్ మాండవీయ ప్రముఖంగా పేర్కొన్నారు.

దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించే లక్ష్యంతో, స్వదేశీ పొటాష్ వనరులకు తోడ్పాటు అందించడానికి పోషకాల ఆధారిత సబ్సిడీ పథకం (ఎన్.బి.ఎస్) పథకంలో పి.డి.ఎం. (మొలాసిస్ నుండి తీసిన పొటాష్)ను కూడా ఎరువుల శాఖ చేర్చింది. స్పెంట్ వాష్ నుండి పొటాష్ తయారీకి ఎరువుల పరిశ్రమలు ఇలాంటి కార్యక్రమాలు చేపట్టాయి.

పొటాషియం యొక్క మూల పదార్థమైన పొటాష్ ను, ఎం.ఓ.పి. రూపంలో నేరుగా వినియోగిస్తారు, అదేవిధంగా ఎన్.పి.కె. ఎరువులలో 'ఎన్' మరియు 'పి' పోషకాలతో కలిపి రెండింటినీ ఉపయోగిస్తారు. భారతదేశం తన పొటాష్ అవసరాన్ని 100 శాతం దిగుమతుల ద్వారా తీర్చుకుంటుంది. భారతదేశం సంవత్సరానికి సుమారు గా 40 లక్షల మెట్రిక్ టన్నుల ఎం.ఓ.పి. ని దిగుమతి చేసుకుంటుంది.

ప్రముఖ ఎరువుల ఉత్పత్తిదారులైన మొజాయిక్ మరియు న్యూట్రియన్ సంస్థల మధ్య ఉమ్మడి సంస్థ ఏర్పాటైన కాన్ పోటెక్స్, కెనడాలోని సస్కట్చేవాన్ ప్రాంతంలో ఉత్పత్తి అవుతున్న పొటాష్‌ను మార్కెట్ చేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పొటాష్ సరఫరా చేసే అతిపెద్ద సరఫరా సంస్థల్లో ఒకటిగా ఉన్న కాన్ పోటెక్స్, భారతదేశంతో సహా, 40 కంటే ఎక్కువ దేశాలకు సంవత్సరానికి 130 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తిని ఎగుమతి చేస్తుంది.

# ప్రజారోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ : ఎంపీ దయాకర్



వరంగల్, సెప్టెంబర్ 29: ప్రభుత్వ వైద్య శాలలు పటిష్టం చేయడం లో భాగంగా ప్రభుత్వ వైద్యశాలలకు అన్ని వసతులు కల్పించి ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడంలో ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని సంబంధిత వైద్యాధికారులను జిల్లా కలెక్టర్ గోపి ఆదేశించారు.

గురువారం బల్దియా పరిధి 27వ డివిజన్ పాత గ్రైన్ మార్కెట్ ప్రాంతం లోగల ప్రభుత్వ ఆయుర్వేద బోధన వైద్య కళాశాల యందు ఎమ్మెల్సీ నిధులతో మహిళలు, పురుషుల సౌకర్యార్థం వేరు వేరు గా ఏర్పాటు చేసిన 80 పడకల విభాగాలను, వరంగల్ కలెక్టర్ కేటాయించిన నిధులతో ఏర్పాటు చేసిన ఆర్.ఓ.ప్లాంట్ ను పార్లమెంట్ సభ్యులు పసునూరి దయాకర్, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, ఎమ్మెల్యే నన్నపు నేని నరేందర్ లతో కలిసి సంయుక్తంగా నగర మేయర్ గుండు సుధారాణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ బసవరాజు సారయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన దగ్గర్నుంచి విద్య వైద్యం పై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ప్రభుత్వ ఆసుపత్రులలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో వరంగల్ ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో గతంలో క్షేత్రస్థాయిలో ఆసుపత్రిని పరిశీలించి సంబంధిత వైద్యాధికారులు సూపరింటెండెంట్ తో సంప్రదించడం జరిగింది అని ఆయుర్వేదిక్ ఆసుపత్రిలో మూడు వార్డులలో బెడ్స్ అందించడం జరిగిందని ఆవార్డ్స్ ను ఈరోజు ప్రారంభించడం జరిగిందని అలాగే జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని చెప్పారు.

ప్రజలు ఆయుర్వేదిక్ వైద్యంపై కూడా ఎక్కువ మక్కువ చూపుతున్నారని ఆయుర్వేదిక్ వైద్యశాలలో డాక్టర్లు ఎప్పుడూ అందుబాటులో ఉంటూ ఆయుర్వేద వైద్యంలో ఉన్నటువంటి అన్ని విధానాల ద్వారా చికిత్సలు అందిస్తున్నారని హర్షించదగ్గ విషయమని ఆయన అన్నారు.

స్థానిక శాసన సభ్యులు నన్నపనేని నరేందర్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లా ను ప్రగతి పథంలో నడిపించడం కొరకు కావలసిన అన్ని సదుపాయాలపై స్థానిక జిల్లా పాలనాధికారి వారితో వివిధ సమావేశాల ద్వారా సంప్రదించు కొన్ని స్థానిక కార్పొరేటర్లు జిల్లా అధికారులను ప్రజలతో మమేకమై ఎప్పటికప్పుడు సమన్వయం చేసుకొని ముందుకు పోతున్నామని, ఈరోజు వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేద హాస్పిటల్ కు వసతులను ప్రారంభించనున్నామని చెప్పారు. అనంతరం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులతో మాట్లాడుతూ వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా ఎంపీ పసునూరి దయాకర్ మాట్లాడుతూ.. అభివృద్ధిలో అగ్రగామి తెలంగాణ రాష్ట్రం అని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో విస్తరిస్తున్నాయి అని చెప్పారు.

గతంలో వరంగల్ ఆయుర్వేదిక్ వైద్యశాలలో బోర్ మోటార్ ఏర్పాటు చేయాలని వైద్యుల విజ్ఞప్తి మేరకు బోరు మోటర్ ఏర్పాటు చేసి ఈ రోజు ప్రారంభించడం జరిగిందని చెప్పారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గోపి మాట్లాడుతూ వరంగల్ ప్రభుత్వ ఆయుర్వేదిక్ వైద్యశాలను గతంలో సందర్శించడం జరిగింది అని ఆర్ఓ ప్లాంట్ ఏర్పాటు చేయాల్సిందిగా వైద్యుల విజ్ఞప్తి మేరకు వెంటనే చర్యలు తీసుకుని కలెక్టర్ ఆధ్వర్యంలో ఆర్వో ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందని ప్రభుత్వ వైద్య సేవలపై వైద్య అధికారులతో ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్ణయించుకొని రోగుల పట్ల సమన్వయంతో వ్యవహరించాలని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులలో అన్ని వ్యాధులకు కావాల్సిన మందులు అందుబాటులో ఉంచుకో వలసినదిగా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్, రాష్ట్ర సరోగసి బోర్డ్ సభ్యురాలు హరి రమాదేవి, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ డా. రవి నాయక్, సూపరింటెండెంట్ డా. పద్మావతి తదితరులు పాల్గొన్నారు.

# తన 18వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా విపత్తు నిర్వహణలో స్వచ్ఛంద సేవను వేడుకగా జరుపుకున్న నేషనల్ డిశాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: నేషనల్ డిశాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డిఎంఎ– జాతీయ విపత్తు నిర్వహణ సంస్థ) బుధవారం నాడు న్యూఢిల్లీలో తన 18వ ఆవిర్భావ దినోత్సవాన్ని జరుపుకుంది. నివారణ, ఉపశమన, సంసిద్ధత, ప్రతిస్పందన వ్యూహ సంస్కృతి ద్వారా సంపూరణ, క్రియయాశీల, బహుళ విపత్తు ఆధారిత, సాంకేతికతలను అభివృద్ధి చేయడం ద్వారా సురక్షితమైన, విపత్తులను తట్టుకునే భారతదేశాన్ని నిర్మించడమే ఎన్‌డిఎంఎ దార్శనికత. ఈ ఏడాది వ్యవస్థాపక దినోత్సవ ఇతివృత్తం వాలంటీరిజం ఇన్ డిశాస్టర్ మేనేజ్‌మెంట్ (విపత్తు నిర్వహణలో స్వచ్ఛంద సేవ).

ఆపద మిత్రుల అస్తిత్వం సేవ, సమర్పణ ఉ పరోపకారమని ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన హోం వ్యవహారాల సహాయమంత్రి శ్రీ నిత్యానందరాయ్ అన్నారు. స్వయం–సమృద్ధ బ, ా ం ్ త ్ ద ే శ ్ ం న ు సృష్టించాలన్నప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ దార్శనికతకు అనుగుణంగా స్వచ్ఛంద సేవకత మనతోనే ప్రారంభమవుతుందని, తక్షణ అవసరమైన సురక్షిత, బలమైన భారతదేశాన్ని నిర్మించేందుకు సమాజాలు ఏకతాటిపైకి రావాలని ఆపదా మిత్రులు సూచించారని ఆయన అన్నారు. నేడు ఎన్‌డిఎంఎ – సిడిఆర్ ఐ వంటి వివిధ అంతర్జాతీయ విపత్తు నిర్వహణా సంస్థలలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించిందని, అంతేకాక పలు జీవితాలను కాపాడేందుకు వీలు కల్పించే ఆవిష్కరణ, సాంకేతికత, నిర్మాణాత్మకమైన, సురక్షితమైన రేపటి కోసం ప్రణాళికల వంటి అంశాలలో పలు కోణాలలో 31 దేశాలకు భారతదేశం నాయకత్వం వహిస్తోందన్నారు. ఒక దశాబ్దం కిందట మరణాల రేటు చాలా ఎక్కువగా ఉండేదని, కానీ ఎన్‌డిఎంఎ విపత్తు నిర్వహణకు నాయకత్వం వహిస్తున్నందున, ప్రాణ నష్టం భారీగా తగ్గిందని, నేడు రక్షణ/ కాపాడేందుకు చేపట్టే చర్యలు మరింత ఆధునికమైనవి అయినప్పటికీ, కోల్పోయిన జీవితాల గత రికార్డుతో పోలిస్తే ఇది చాలా తక్కువ అని ఆయన అభిప్రాయపడ్డారు.

స్వయం సేవకత అన్న ఇతివృత్తాన్ని అంగీకరిస్తూ, ఏ విపత్తులోనైనా ప్రభుత్వ యంత్రాంగం ఎంత త్వరితగతిన స్పందించినా, బాహ్య సహాయం బాధిత ప్రజలను చేరుకోవడానికి సమయం పడుతుందని, ఈ సమయంలో తీసుకునే సమయమే జీవితాలను, జీవనోపాధిని కాపాడడానికి కీలకమని హోం వ్యవహారాల సహాయం మంత్రి శ్రీ అజయ్ కుమార్ మిశ్రా అన్నారు. కనుక, సరైన శిక్షణ, సన్నద్ధత ఉన్నప్పుడు తక్షణ, తొలి ప్రతిస్పందన అన్నది నష్టాలను తగ్గించడంలో కీలకపాత్ర పోషించగల స్వచ్ఛంద సేవకులు బాధిత సమాజం నుంచే వస్తారన్నారు. విపత్తు నిర్వహణపై జాతీయ విధానం 2009లో విపత్తు నిర్వహణలో స్వయం సేవకత అవసరాన్ని సూచించినప్పటికీ, విపత్తు ప్రమాదాన్ని తగ్గించే అజెండాలో తన పది అంశాలను ఉద్ఘాటించారని ఆయన అన్నారు. ఇందులో భాగంగా స్థానిక సామర్థ్యాల నిర్మాణం, చొరవలు, విపత్తు ప్రమాద నిర్వహణలో స్వయం సేవకతను ప్రోత్సహించాల్సిన అవసరాన్ని నొక్కి చెప్పారన్నారు. ఈ నేపథ్యంలోనే కేవలం ఉపశమనం కేంద్రీకృత విధానం నుంచి తమ దృష్టిని విస్తృతం చేసిపునర్నిర్మాణం, పునరావాసపరంగా నివారణ, ఉపశమనంతో కూడిన క్రియాశీల వైఖరిని అనుసరించాలని ప్రధానమంత్రి మోదీ ఎన్‌డిఎంఎను కోరిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు.

ఈ వేడుకలలో కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్, బీహార్, అస్సాం, ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన శిక్షితులైన ఆపదామిత్ర వాలంటీర్లతో పాటుగా, నేషనల్ కేడెట్ కోర్ (ఎన్ సిసి), నేషనల్ సర్వీస్ స్కీం (ఎన్ఎస్ఎస్), నెహ్రూ యువ కేంద్ర (ఎన్‌వైకె), సివిల్ డిఫెన్స్ అండ్ భారత్ స్కౌట్ ఉ గైడ్ (బిఎస్‌జి)కు చెందిన కేడెట్లు, వాలంటీర్లు హాజరై, తమ వ్యక్తిగత పరికరాలను (ఇఆర్‌కె)ను, జిల్లా స్థాయి ఇఇఆర్ఆర్ పరికరాలను ఆవరణలో ప్రదర్శించారు.

ఈ సందర్భంగా జరిగిన సాంకేతిక సెషన్లలో విపత్తు నిర్వహణలో స్వయం సేవకు సంబంధించిన చర్చలు, అనుభవాలు పంచుకోవడం జరిగింది. విపత్తు నిర్వహణలో స్వయం సేవకతకు సంబంధించిన ఉత్తమ ఆచరణలను పాల్గొన్న రాష్ట్రాలు ఇతరులతో పంచుకున్నాయి. స్వచ్ఛంద సంస్థలైన (ఎన్జీవో), సీడ్స్ ( ), స్ఫియర్ ఇండియా, వరల్డ్ విజన్ ఇండియా, యాక్షన్ ఎయిడ్ ఇండియా స్వయం సేవకత ద్వారా విపత్తు నిర్వహణపై తమ కేస్ స్టడీలను సమర్పించాయి. అనంతరం, వర్తమానంలో, భవిష్యత్తులో విపత్తు నిర్వహణలో ఎన్ఎస్ఎస్, ఎన్‌సిసి, ఎన్‌వైకె, ఎన్ఎస్‌జి కు చెందిన కేడెట్లు / వాలంటీర్ల పాత్ర సాధ్యతపై చర్చ నిర్వహించారు. అనంతరం, ప్రధానమంత్రి ముఖ్య సలహాదారు డాక్టర్ పి.కె. మంత్రి అధ్యక్షతన జరిగిన ముగింపు సభలో ఎన్‌డిఎంఎ, ఆపదామిత్ర, ఇతర వాలంటీర్ల కృషి విపత్తు నిర్వహణలో అంతర్భాగంగా ఆయన వర్ణించారు.

## అభివృద్ధికి ఆకర్షితులయ్యే టీఆర్ఎస్‌లో చేరికలు : ఎమ్మెల్యే సంజయ్



జగిత్యాల, సెప్టెంబర్ 29: రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల పట్ల ఆకర్షితులై వివిధ పార్టీల నుంచి స్వచ్ఛందంగా టీఆర్ఎస్‌లో చేరుతున్నారని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్‌అన్నారు. బీర్‌పూర్ మండలం కోల్వాయి గ్రామానికి చెందిన 20మంది బీజేపీ, కాంగ్రెస్ నాయకులు సర్పంచ్ మల్లేశం అధ్వర్యంలో టీఆర్ఎస్ పార్టీలో చేరారు.

వారికి ఎమ్మెల్యే గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..టీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తను కంటికి రెప్పలా చూసుకుంటామన్నారు.

కార్యక్రమంలో కేడీసీసీ జిల్లా మెంబర్ రామ్ చందర్ రావు, జిల్లా రైతు బంధు సమితి సభ్యుడు కొలుముల రమణ, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి శీలం రమేష్, గ్రామ శాక అధ్యక్షుడు రామకృష్ణ, సతీష్, రమేష్,గుండా సురేష్, తదితరులు పాల్గొన్నారు.

## ఐదేళ్లలో 73శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ : హరీశ్‌రావు




సిద్ధిపేట, సెప్టెంబర్ 29: ఐదేళ్లలో 73శాతం ఫిట్‌మెంట్ ఇచ్చిన ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని రాష్ట్ర ఆర్థిక మంత్రి హరీశ్‌రావు అన్నారు. సిద్ధిపేట జిల్లాకేంద్రంలోని విపంచి ఆడిటోరియంలో ఎస్టీయూ 75 వసంతాల వజ్రోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర వజ్రోత్సవ వేడుకలు, జాతీయ సమైక్యత తెలంగాణ వజ్రోత్సవాలు ఏ విధంగా జరుపుకున్నామో.. ఇవాళ ఎస్టీయూ 75 వసంతాలు జరుపుకోవడం చాలా గర్వకారణమన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో తెలంగాణ తరహాలో వేతనాలు లేవని, కేవలం రాష్ట్రంలోనే ఇస్తున్నామన్నారు.

ఇవాళ దేశంలో ఒక్క తెలంగాణ రాష్ట్రంలో తప్ప.. ఏ రాష్ట్రంలో ప్రతి రోజూ ఇంటింటికీ తాగునీరు అందివ్వలేదన్నారు. ఇవాళ కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి మిషన్ భగీరథకు బహుమతి అందించిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో 12శాతం బడ్జెట్‌ను విద్యారంగంపై పెట్టడం గర్వ కారణమన్నారు. తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలను కేంద్ర ప్రభుత్వం కాపీ కొట్టి అమలు చేస్తుందని విమర్శించారు. పక్క రాష్ట్రాల్లో ఎమ్మెల్యేలు, ఎంపీలు తెలంగాణలో అమలవుతున్న పథకాలు అందించాలని అసెంబ్లీలలో అడుగుతున్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి న్యాయంగా రావాల్సిన రూ.30వేలకోట్లు బకాయిలు ఇవ్వడం లేదని, తెలంగాణలో అమలవుతున్న పథకాలు అపాలని బీజేపీ ప్రభుత్వం చూస్తోందని మండిపడ్డారు. రైతు బతుకు అరటాకు మీద ముల్లులాంటిదని, అలాంటి రైతులను కాపాడుకోవడం మన బాధ్యతన్నారు. సిద్ధిపేట జిల్లావ్యాప్తంగా 5.50 లక్షల మెట్రిక్ టన్నుల పంట దిగుబడి వస్తున్నది, 75 ఏండ్లలో కానీ అభివృద్ధి 7 ఏండ్లలో చేసి చూపెట్టామన్నారు. 75 ఏండ్లలో 5 మెడికల్ కళాశాలలు ఉంటే, ఏడేండ్లలో తెలంగాణలో 17 ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఏర్పాటు చేసుకున్నామని, 75 ఏండ్లలో రాష్ట్రంలో 800 మెడికల్ సీట్లు ఉంటే, ఇవాళ 2,840 మెడికల్ సీట్లు వచ్చాయని గుర్తు చేశారు.

విద్య, వైద్య రంగాన్ని అన్ని కోణాల్లో అభివృద్ధి చేస్తున్నామని, విద్యాశాఖతో పాటు ఇతరశాఖలను కలుపుకుని 11శాతం విద్యపై బడ్జెట్ పెట్టామన్నారు. కేంద్రం కోతలు పెట్టినా కానీ, తెలంగాణ రాష్ట్రంలో ఎలాంటి సంక్షేమ పథకాలను ఆగడం లేదన్నారు. మన ఊరు–మనబడి కార్యక్రమానికి రూ.7,300 కోట్లు బడ్జెట్లో ప్రవేశపెట్టామన్నారు. ఉపాధ్యాయులకు కొన్ని సమస్యలు ఉన్నాయని, సాధ్యమైనంత వరకూ సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇస్తున్నాన్నారు. ఈహెచ్ఎస్ పథకం అమలు కోసం సీఎం దృష్టికి తీసుకెళ్తానన్నారు.

## రజకుల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి : మంత్రి గంగుల

కరీంనగర్, సెప్టెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): : రజకులపట్ల గత ప్రభుత్వాలు వివక్ష చూపించాయి. రజకుల బాగోగులు పట్టించుకోలేదని బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. కరీంనగర్ 4వ డివిజన్ లో రూ. 2 కోట్లతో నిర్మించనున్న అత్యాధునిక దోభీఘాట్ నిర్మాణ పనులను మంత్రి ప్రారంభించి మాట్లాడారు.

గతంలో బట్టలు ఉతకాలంటే ఇబ్బందులు పడాల్సిన రోజులు. స్వయం పాలనలో రజకుల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. రజక వృత్తిలో ఆధునికీకరణ జరగాలని..అత్యాధునిక దోభీఘాట్లను సీఎం నిర్మిస్తున్నారని తెలిపారు. దొరల అరాచకానికి వ్యతిరేకంగా పోరాడిన చాకలి ఐలమ్మను గత పాలకులు పట్టించుకోలేదు.

కానీ, తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ చాకలి ఐలమ్మను గుర్తించి..జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహిస్తున్నారని గుర్తు చేశారు. కాంగ్రెస్,బీజేపీ పాలిత రాష్ట్రాలకంటే తెలంగాణ అభివృద్ధిలో దూసుకుపోతుందన్నారు. అభివృద్ధి చెందిన తెలంగాణాలో పాత పాలకులు అధికారంలోకి వస్తే మళ్లీ గుడ్డిదీపం పెట్టుకోవాల్సిన రోజులొస్తాయి. టీఆర్ఎస్ పార్టీతోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం అన్నారు.

రాష్ట్రాన్ని దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దుతున్న సీఎం కేసీఆర్‌కు అండగా ఉందామన్నారు. కార్యక్రమంలో మేయర్ సునీల్ రావు, అదనపు కలెక్టర్ గరీమా అగర్వాల్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# 'జాతీయ క్రీడా అవార్డులు -2022' దరఖాస్తుల స్వీకరణ చివరి తేదీని పొడిగింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: యువజన వ్యవహారాలు ఁ క్రీడల మంత్రిత్వ శాఖ వివిధ జాతీయ క్రీడా అవార్డుల నిమిత్తం దరఖాస్తులను ఆహ్వానించింది. 2022 సంవత్సరానికి మేజర్ ధ్యాన్ చంద్ ఖేల్ రత్న అవార్డులు, అర్జున అవార్డు, ద్రోణాచార్య అవార్డు, ధ్యాన్ చంద్ అవార్డు, రాష్ట్రీయ ఖేల్ ప్రోత్సాహన్ పురస్కార్ (ఆర్‌కేపీపీ), మౌలానా అబుల్ కలాం ఆజాద్ (ఎంఏకేఏ) ట్రోఫీ -2022 తదితర అవార్డులకు గత ఆగస్టు 27 న మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. యువజన వ్యవహారాలు ఁ క్రీడల మంత్రిత్వ శాఖ వెబ్‌సైట్ లిలిలి.ఎజీబ.నితిఇ.తినిలో ఈ నోటిఫికేషన్ జారీ చేయబడింది.ఈ అవార్డు కోసం అర్హులైన క్రీడాకారులు/ కోచ్‌లు/ ఎంటిటీలు/ విశ్వవిద్యాలయాల వారి నుండి దరఖాస్తులు ఆహ్వానించబడ్డాయి. దరఖాస్తుల స్వీకరణకు చివరి తేదీ 27 సెప్టెంబర్, 2022 నుండి అక్టోబర్ 1, 2022 (శనివారం) వరకు పొడిగించబడింది. సంబంధితులు టఎబిఎజీబ-బజూనీతీబిబ.ఐనీల.తినిలో ఆన్‌లైన్‌లో స్వయంగా దరఖాస్తు చేసుకోవాలి. ఇండియన్ ఒలింపిక్స్ అసోసియేషన్ / స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా / గుర్తింపు పొందిన నేషనల్ స్పోర్ట్స్ ఫెడరేషన్లు / స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డులు / రాష్ట్ర, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వాలు మొదలైన వారికి కూడా తదనుగుణంగా విషయం తెలియజేయబడింది.

అక్టోబర్ 1, 2022 (శనివారం) తర్వాత అందే నామినేషన్లు పరిగణలోకి తీసుకోబడవు.

# పండుగను కుటుంబసభ్యులతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలి

మెదక్, సెప్టెంబర్ 29: నేటినిజం (ప్రతినిధి):చెడుపై సాధించిన విజయానికి ప్రతీక విజయదశమి అని దసరా పండుగను కుటుంబసభ్యులతో ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అదనపు కలెక్టర్ రమేష్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకొని గురువారం తన ఛాంబర్ లో పౌర సరఫరాల శాఖా ఆధ్వర్యంలో జిల్లాలోని ఏడూ మండల స్థాయి స్టాక్ పాయింట్ లలో పనిచేస్తున్న 81 మంది హమాలీలకు ఒక్కొక్కరికి ఒక జత బట్టలు, 500 నగదు తో పాటు స్వీట్ బాక్స్ ను అందజేశారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ దసరా పండుగను ప్రతి ఒక్కరు ఆనందోత్సవాల మధ్య జరుపుకోవాలని ప్రతి సంవత్సరం మాదిరే ఈ సంవత్సరం కూడా హమాలీలకు ఒక జత బట్టలతో పాటు స్వీటు, నగదును అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ గోపాల్, పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్,హమాలీలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలందరూ అత్యంత వైభవోపేతంగా జరుపుకునే పండుగ బతుకమ్మ





మెదక్, సెప్టెంబర్ 29: నేటినిజం (ప్రతినిధి):చిన్న, పెద్ద తేడా లేకుండా మహిళలందరూ అత్యంత వైభవోపేతంగా జరుపుకునే పండుగ బతుకమ్మ అని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ అన్నారు. బతుకమ్మ ఉత్సవాలలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఆవరణలో జిల్లా పరిషద్, జిల్లా పంచాయతీ, గణాంక శాఖల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అట్ల బతుకమ్మ పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మండల పరిషద్ అధికారులు, పంచాయతీ రాజ్ కార్యదర్శులు, గణాంక అధికారులు, మహిళా ఉద్యోగినులతో కలిసి బతుకమ్మ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆనందాలను, ఆప్యాయతలను పంచడమే కాకుండా విలువలకు అద్దం పడుతుంది బతుకమ్మ పండుగ అని అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ ఆవరణలో ఎస్సి, ఎస్టీ, బిసి, జిల్లా సహకార శాఖల ఆధ్వర్యంలో అలిగిన బతుకమ్మ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆమె తెలిపారు. అదేవిధంగా స్థానిక బాలుర జూనియర్ కళాశాల ఆవరణలో సాయంత్రం 4 గంటలకు జిల్లా స్థాయిలో బతుకమ్మ సంబురాలను నిర్వహిస్తున్నామని అన్నారు. ఇట్టి కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యురాలు పద్మా దేవేందర్ రెడ్డి పాల్గొంటారని, కాబట్టి జిల్లా అధికారులు తమ మహిళా సిబ్బందితో బతుకమ్మ ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేయవలసినదిగా ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ ఇందిర, మత్స్య శాఖా సహాయ సంచాలకులు రజిని, జిల్లా పరిషద్ సీఈఓ శైలేష్, డిఆర్ డిఓ శ్రీనివాస్, డిపిఓ తరుణ్ కుమార్, ముఖ్య ప్రణాళికాధికారి చిన కొట్యా నాయక్, డిపిఆర్ ఓ శాంతికుమార్, బతుకమ్మ సమన్వయాధికారి రాజి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు నామినేషన్ వేస్తా: దిగ్విజయ్ సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: కాంగ్రెస్ అధ్యక్ష పదవి రేసులో దిగ్విజయ్ సింగ్ ఉన్నారు. నామినేషన్ పత్రాల్ని తీసుకునేందుకు ఢిల్లీకి వచ్చినట్లు ఆయన తెలిపారు. అధ్యక్ష పదవి కోసం రేపు నామినేషన్ వేయనున్నట్లు ఇవాళ ఆయన స్పష్టం చేశారు. అక్టోబర్ 17వ తేదీన కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికలు జరగనున్న విషయం తెలిసిందే. 75 ఏళ్ల మాజీ సీఎం దిగ్విజయ్ సింగ్.. గాంధీ కుటుంబానికి సన్నిహితుడు. కేరళ ఎంపీ శశి థరూర్ కూడా అధ్యక్ష పదవి కోసం పోటీపడనున్న విషయం తెలిసిందే. థరూర్ రేపు తన నామినేషన్ దాఖలు చేయనున్నారు. రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ కూడా నామినేషన్ వేస్తారని ఊహాగానాలు వినిపిస్తున్నాయి.

# తేదీల్లో స్వచ్ఛ్ షెహర్ సంవాద్ & టెక్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్న కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: స్వచ్ఛ్ అమృత్ మహోత్సవ్, 17 సెప్టెంబర్ 2022 (సేవా దివస్) నుండి 2 అక్టోబర్ 2022 (స్వచ్ఛత దివస్) వరకు పక్షం రోజుల పాటు జరుగుతున్న వివిధ అంశాలపై కార్యకలాపాలను స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ ఎనిమిదేళ్లను పురస్కరించుకుని కేంద్ర గృహ నిర్మాణం, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రకటించింది. దీనికి సంబంధించి, గృహ నిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్వచ్ఛ భారత్ మిషన్ కింద స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ -2022 కింద సెప్టెంబర్ 29 నుండి 30వ తేదీ వరకు 'స్వచ్ఛ్ షెహర్ సంవాద్', 'టెక్నాలజీ ఎగ్జిబిషన్'ను నిర్వహిస్తోంది.

సంవాద్‌కు దేశంలోని వివిధ రాష్ట్రాలు, పట్టణాల నుండి ఉన్నతాధికారులు, సంబంధిత రంగాల భాగస్వాములు, పరిశ్రమల ప్రతినిధులు, ఎన్‌జీఓలు, విద్యాసంస్థలు మొదలైన వారితో సహా 800 మంది ప్రతినిధులు హాజరకానున్నారు. కేంద్ర గృహనిర్మాణ మరియు పట్టణ వ్యవహారాల మంత్రి శ్రీ హర్‌దీప్ సింగ్ పూరి ఈ సంవాద్ టెక్ ఎగ్జిబిషన్ ను ఎగ్జిబిషన్ సెప్టెంబర్ 29, 2022 ప్రారంభిచనున్నారు.

ఈ కార్యక్రమం స్వచ్ఛ భారత్ మిషన్ అర్బన్ 2.0 యొక్క సామర్థ్య నిర్మాణ చొరవ, రాష్ట్రాలు నగరాలను వ్యర్థ పదార్థాల నిర్వహణలో ఇటీవలి పరిణామాలన్నింటిపై అవగాహన కలిగిస్తుంది. మునిసిపాలిటీలు ఘన వ్యర్థాలు మరియు ద్రవ వ్యర్థాల నిర్వహణకు సంబంధించిన అంశాలకు సంబంధించి ప్రత్యేకంగా నిర్వహించబడిన అధిక నాణ్యత గల సాంకేతిక, పరిపాలనాపరమైన చర్చలను ఇది వీలు కల్పిస్తుంది. తద్వారా రాష్ట్రాలు, నగరాలు వ్యర్థ రహిత స్థితి వైపు వారి ప్రయాణంలో వ్యూహాలు, ఉత్తమ పద్ధతులు, సవాళ్లపై చర్చించడానికి వీలు కల్పిస్తుంది. సంవాద్ వారి అనుభవాలు, ఉత్తమ నిర్వహణలను పంచుకోవడానికి దాదాపు 16 రాష్ట్రాల నుండి అధికారులు రానున్నారు. వీరితో పాటు యూఎన్‌డీపి, జీఐజెడ్ ఇండియా, యూఎస్‌ఎయిడ్, ఐఎఫ్‌సీ నుండి భాగస్వాములు మరియు ఐఐటీ రూర్కీ, బార్క్, సీఎస్ఈ, టీఈఆర్ఐ మొదలైన విద్యా మరియు పరిశోధనా సంస్థల నిపుణులు కూడా వారి నైపుణ్యాలను, ఆలోచనలను పంచుకుంటారు.

దేశవ్యాప్తంగా వ్యర్థాల నిర్వహణలో అత్యుత్తమ పనితీరు నమూనాలను ప్రదర్శించే టెక్ ఎగ్జిబిషన్ కూడా సంవాద్‌లో భాగంగా ఉంటుంది. దాదాపు 35 టెక్నాలజీ ఆధారిత సంస్థలు వ్యర్థాల నిర్వహణలో అత్యాధునిక సాంకేతికతను ప్రదర్శిస్తారు. ఐటీ మరియు జీఐఎస్ ఆధారిత అప్లికేషన్లు, వ్యర్థ నీటి నిర్వహణ, ప్యాకేజింగ్ ఆప్షన్లు, 3ఆర్ లు (రెడ్యూస్-రీసైకిల్-రీయూజ్), మునిసిపల్ ఘన వ్యర్థాల ప్రాసెసింగ్, మొబైల్, పోర్టబుల్ యూనిట్లు వంటి ఘన వ్యర్థాల నిర్వహణ, నిర్మాణం మరియు కూల్చివేత వ్యర్థాలు మరియు నివారణ చర్యలు వంటి అంశాలపై వర్కింగ్ మోడల్‌లు ప్రదర్శించబడతాయి. వ్యర్థ రహిత నగరాలు, ఆకాంక్షాభరిత మరుగుదొడ్లు, వ్యర్థ నీటి నిర్వహణ మొదలైన వాటితో సహా మిషన్ కార్యక్రమాలపై నేపథ్య ప్రయోగాత్మక ప్రదర్శనలు కూడా ఇందులో ఉండనున్నాయి.

కేంద్ర సహాయమంత్రి, శ్రీ కౌశల్ కిషోర్, 30 సెప్టెంబర్ 2022న ముగింపు సమావేశంలో ప్రతినిధులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. ఈ సందర్భంగా, 17 సెప్టెంబర్ 2022న ప్రారంభించబడిన ఇండియన్ స్వచ్ఛతా లీగ్ (ఐఎస్ఎల్) నగరాంతర పరిశుభ్రత ప్రచార పోటీలో విజేతలు ప్రకటించి సత్కరించారు.

1 అక్టోబర్ 2022న ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న ఆజాదీఏ75 స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డులు ప్రకటించబడే గ్రాండ్ ఫినాలేకి సంవాద్ ఒక నాందిగా ఉంటుంది. గౌరవనీయులైన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము ఈ సందర్భాన్ని పురస్కరించుకుని స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల యొక్క వివిధ విభాగాలలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన నగరాలను, రాష్ట్రాలను సత్కరిస్తారు. వ్యర్థ రహిత నగరాల సామూహిక దృక్పథాన్ని ఇతర నగరాలు అనుసరించడానికి, సాకారం చేసుకోవడానికి ఈ అవార్డులు నగరాలను మరింత ప్రేరేపించడానికి ఉపయోగపడతాయని భావించారు.

# జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల హబ్ కార్యక్రమాలపై షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో అవగాహన సదస్సు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 29: జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల హబ్ అమలు చేస్తున్న కార్యక్రమాలు, మంత్రిత్వ శాఖ అమలు చేస్తున్న కార్యక్రమాలపై షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో 2022 సెప్టెంబర్ 28న సదస్సు నిర్వహించింది. సదస్సులో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సంక్షేమం కోసం ఏర్పాటైన పార్లమెంట్ స్థాయి సంఘం అధ్యక్షుడు, పార్లమెంట్ సభ్యులు డాక్టర్ కిరీట్ ప్రేమ్‌జీభాయ్ సోలంకి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన దాదాపు 300 మంది ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు సదస్సుకు హాజరయ్యారు. నేషనల్ స్మాల్ ఇండస్ట్రీస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఔఎఐ) చైర్మన్-కమ్-మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ గౌరంగ్ దీక్షిత్ స్వాగత ఉపన్యాసంతో ప్రారంభమైన సదస్సులో కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి మెర్సీ ఎపావో కీలకోపన్యాసం చేశారు. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఔత్సాహిక మరియు ఇప్పటికే పరిశ్రమలు నిర్వహిస్తున్న వారికి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు,రుణ సంస్థలు, జెమ్ , గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణా సంస్థలు, ట్రిఫెడ్ , ట్రైఫెడ్ మొదలైన వాటిపై అవగాహన పొందేందుకు సదస్సు సహకరించింది.

జాతీయ షెడ్యూల్డ్ కులాలు, తెగల హబ్ అమలు చేస్తున్న కార్యక్రమాలను ఉపయోగించుకుని గుజరాత్ రాష్ట్రానికి చెందిన షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ప్రయోజనం పొందాలని డాక్టర్ సోలంకి సూచించారు. వ్యాపార కార్యక్రమాలను ప్రారంభించేందుకు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన పారిశ్రామికవేత్తలకు ప్రాధాన్యత ఇచ్చి రుణాలు మంజూరు చేయాలని సదస్సుకు హాజరైన బ్యాంకర్లను ఆయన కోరారు.దీనివల్ల వ్యాపార విస్తరణలో ఎలాంటి సమస్యలు ఎదురుకావని అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ సూచించిన విధంగా ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా ఉద్యోగాలు ఇచ్చే పారిశ్రామికవేత్తలుగా మారేందుకు యువత కృషి చేయాలని అన్నారు. భారత ఆర్థిక వ్యవస్థను పటిష్టం చేసేందుకు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన పారిశ్రామిక వేత్తలు ముందుకు రావాలని అన్నారు.

నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ లిమిటెడ్, ఫుడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఆయిల్ అండ్ నేచురల్ గ్యాస్ కార్పొరేషన్ మరియు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ వంటి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలు సదస్సులో పాల్గొన్నాయి. విక్రేత నమోదు ప్రక్రియ మరియు సేకరిస్తున్న ఉత్పత్తులు/సేవలు తదితర అంశాలను సంస్థల ప్రతినిధులు వివరించారు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా మరియు యెస్ బ్యాంక్ వంటి ఆర్థిక సంస్థలు కూడా ఈ సదస్సులో పాల్గొన్నాయి. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల రంగానికి సంబంధించిన వివిధ రుణ పథకాలకు వివరాలు అందించారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలకు అందిస్తున్న సహకారం, అభివృద్ధికి అమలు చేస్తున్న వివిధ కార్యక్రమాల వివరాలను జెమ్,కేవీఐసి, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ లాంటి ఇతర ప్రభుత్వ సంస్థలు వివరించాయి. ఈ సదస్సులో జఆజంఓ నమోదు, జెమ్ రిజిస్ట్రేషన్‌ల అంశంలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సహకారం అందించేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

భారత ఆర్థిక వ్యవస్థ సమ్మిళిత వృద్ధి కోసం నేషనల్ షెడ్యూల్డ్ కాస్ట్ షెడ్యూల్డ్ ట్రైబ్స్ హబ్ (ఔఊఊ) పథకాన్ని కేంద్ర సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. సామర్థ్యాన్ని పెంపొందించడం, ప్రభుత్వ కొనుగోళ్లలో షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారు ఎక్కువగా పాల్గొనేలా చూసేందుకు వ్యవస్థాపకత శక్తిని ప్రోత్సహించడం లక్ష్యంగా పథకం అమలు జరుగుతున్నది.

దేశ ఆర్థిక వ్యవస్థలో సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల పాత్ర కీలకంగా ఉంటుంది. సమగ్ర అభివృద్ధి కోసం యువతలో వ్యవస్థాపకత ప్రోత్సహించడానికి మరియు ఆత్మ నిర్భర్ భారత్ సాధనలో భాగస్వాములను చేసేందుకు షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన వారిని ప్రోత్సహించేందుకు కేంద్రీకృత ప్రయత్నాలు అమలు జరగాల్సి ఉంటుంది.

దేశ ఆర్థికాభివృద్ధి కోసం సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల రంగాన్ని మరింత అభివృద్ధి చేయాల్సి ఉంటుంది. స్థిరమైన వృద్ధి కోసం సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలను బలోపేతం చేయడానికి మరియు ప్రపంచ విలువ ఆధారిత వ్యవస్థ సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమలు పోటీ పడేలా చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. షెడ్యూల్డ్ కులాలు, తెగలకు చెందిన సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కల్పించేందుకు ఏర్పాటయ్యే రాష్ట్ర స్థాయి సమావేశాలు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలపై వారికి అవగాహన కల్పించి వారి పరిధులను విస్తరించేందుకు సహాయపడతాయి.

# తెలంగాణలో సహకార వ్యవస్థను పటిష్టం చేశాం : మంత్రి నిరంజన్ రెడ్డి




వనపర్తి, సెప్టెంబర్ 29: తెలంగాణ రాష్ట్రంలో సహకార వ్యవస్థను పటిష్టం చేశాం. ధాన్యం కొనుగోళ్లు సహకార సంఘాలకు అప్పగించిన తర్వాత అవి బలపడ్డాయి అని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. వనపర్తి మండల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సర్వసభ్య సమావేశానికి మంత్రి హాజరయ్యారు.

గోపాల్ పేట మండలం మున్ననూర్ గ్రామంలో పింఛన్లు, బతుకమ్మ చీరలు పంపిణీ చేసిన అనంతరం చెన్న కేశవ స్వామి దేవాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..సహకార రంగం అప్పులు ఇవ్వడానికి ఏర్పాటు చేయలేదు. అప్పుల ఊబి నుంచి రైతాంగాన్ని బయట పడేయడానికి ఏర్పాటు చేసిందన్నారు.ఇన్నేండ్లలో ఏ పాలకుడు రైతు గురించి ఆలోచించ లేదు. తెలంగాణ రాష్ట్రంలో రైతు ఇంటికి వెళ్లి రైతుబంధు పథకం అందిస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి దేశం ఆశ్చర్యపోతుందన్నారు.

రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ అమలు చేస్తాం. వ్యాపారులకు రుణం ఇచ్చే స్థాయికి రైతులు ఎదగాలి అన్నది ప్రభుత్వ ఆలోచన అన్నారు. రైతులు పంటల మార్పిడి మీద దృష్టి సారించాలన్నారు. పేదలు ఆర్థికాభివృద్ధి సాధించే విధంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు

# పశువుల గర్భకోశ సమస్యలపై రైతులకు అవగాహన



మహబూబాబాద్, సెప్టెంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలంలోని పోచంపల్లి గ్రామంలో గోపాలమిత్ర కేంద్రం యందు జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పాడిపశువుల "ఉచిత గర్భ కోశ చికిత్స శిబిరం ". నిర్వహించడం జరిగింది. 76 పాడిపశువులకు వివిధ రకాల గర్భ కోశ వ్యాధులు నిర్ధారించి చికిత్స అందించడం జరిగింది. పశుగణాభివృద్ధి సంస్థ ఈసి సభ్యులు రాసాల సమ్మయ్య, ఉప సర్పంచ్ బి.చంద్ర శేఖర్, జిల్లా పశుగణాభివృద్ధి కార్యనిర్వాహణ అధికారి డాక్టర్ వి. రఘుబాబు,డాక్టర్ రవీందర్,కెయుకె శాస్త్రవేత్త పెద్దవంగర పశు వైద్యాధికారి డాక్టర్ బి.రాజశేఖర్, డాక్టర్ ఎం.అనిల్ గ్రామంలో పశువులకు, గర్భకోశ సమస్యలపై పాడి రైతులకు పశువులకు సరైన ఎధ లక్షణాలు, పశుగ్రాసాల గూర్చి రైతులకు తెలియజేశారు. పాడి రైతులకు యాజమాన్య అంశాలను హాజరైన పాడి పశువులకు వ్యాధిని గుర్తించి మందులు,మినరల్ మిశ్చర్, క్యాల్షియమ్ పశువులు ఎదకు వచ్చేందుకు మందులు ఉచితంగా పాడి రైతులకు అందజేయడం జరిగింది. దూడలకు నట్టల మందు తాగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ( ఉమ్మడి వరంగల్ జిల్లా ) సేవలను గూర్చి పాడి రైతులకు పూర్తిగా వివరించారు. ఈ కార్యక్రమంలో గోపాల మిత్రులు, గోపాలమిత్ర సూపర్వైజర్ , పాలిటెక్నిక్ విద్యార్థులు గ్రామ పాడి రైతులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# అటవీ శాఖలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట : మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి



యాదాద్రి భువనగిరి, సెప్టెంబర్ 29: అటవీ శాఖలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. రూ. 3.17 కోట్ల వ్యయంతో నిర్మించిన యదాద్రి భువనగిరి జిల్లా అటవీ శాఖ కార్యాలయ సముదాయ భవనాన్ని మంత్రి జగదీష్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి మాట్లాడుతూ..ప్రజల ఆకాంక్షలకు, ఆశలకు అనుగుణంగా పరిపాలన ఉండాలని సీఎం కేసీఆర్ అధికార వికేంద్రీకరణ ద్వారా పాలన సులభతరం చేశారన్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణతో రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు జరిగిందని తెలిపారు.

మరో వైపు అడవుల సంరక్షణ, అటవీ శాఖలో మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని పేర్కొన్నారు. జిల్లాల పునర్విభజన అనంతరం కొత్త జోనల్ వ్యవస్థ అమలులోకి రావడం వల్ల అటవీ శాఖకు కొత్త రూపు వచ్చిందని చెప్పారు. వసతులను మెరుగుపరచడంతో పాటు అవసరమైన మౌలికవసతుల కల్పన కోసం కృషిచేస్తున్నామని అన్నారు.

హరితహారం కార్యక్రమం ద్వారా పెద్ద ఎత్తున మొక్కలు నాటుతున్నామని, రాష్ట్ర వ్యాప్తంగా పచ్చదనం పెరిగి సకాలంలో వర్షాలు కురుస్తున్నాయని పేర్కొన్నారు. అడవులు తక్కువగా ఉన్న ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అడవుల పెంపకంపై అటవీ అధికారులు మరింత దృష్టి సారించాలని సూచించారు.

అనంతరం హరితహార కార్యక్రమంలో భాగంగా మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, జగదీశ్ రెడ్డి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా రెడ్డి, జెడ్పీ చైర్మన్ సందీప్ రెడ్డి, ఆయిల్ ఫెడ్ చైర్మన్ రామకృష్ణ రెడ్డి, ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే పైళ్ల శేఖర్ రెడ్డి, ఎమ్మెల్సీ నర్సిరెడ్డి, అటవీ శాఖ స్పెషల్ సీఎస్ శాంతి కుమారి, పీసీసీఎఫ్ ఆర్. ఎం.డొబ్రియల్ తదితరులు పాల్గొన్నారు.

# మూడు లక్షల మంది భక్తులకు గరుడ వాహన సేవాభాగ్యం : టీటీడీ ఈవో



తిరుమల , సెప్టెంబర్ 29: శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో అతి ప్రధానమైన గరుడసేవ అక్టోబర్ 1న జరగనున్న నేపథ్యంలో భక్తులందరికి వాహన దర్శనం కల్పించేందుకు విస్తృత ఏర్పాటు చేసినట్లు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. ఇవాళ శ్రీవారి ఆలయ నాలుగు మాడ వీధుల్లో హారతి పాయింట్లు, గ్యాలరీలను ఈవో, డీఐజీ రవి ప్రకాష్, జిల్లా ఎస్పీ పరమేశ్వర్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

ఈవో మాట్లాడుతూ దాదాపు మూడు లక్షల మంది భక్తులకు శ్రీవారి గరుడ వాహన దర్శనం కల్పించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది సౌత్ వెస్ట్ గేటు, నార్త్ వెస్ట్ గేటు, నార్త్ ఈస్ట్ గెట్ల వద్ద ఉన్న హారతి పాయింట్లలో హారతులకు బదులు భక్తులను స్వామి వారి వాహన సేవకు అనుమతిస్తామన్నారు. ప్రతి హారతి పాయింట్లో 10 వేల మందికి గరుడసేవ దర్శనం కల్పించేందుకు అవకాశం కలుగుతుందన్నారు.

టీటీడీ బోర్డు నిర్ణయం మేరకు వీఐపీ బ్రేక్ దర్శనాలు, ప్రత్యేక ప్రవేశ దర్శనం, వివిధ రకాల ప్రివలైజ్ దర్శనాలు రద్దుచేసి, సామాన్య భక్తులకు పెద్దపీట వేసినట్లు తెలిపారు.

# జిల్లాలో పెసర్ల కొనుగోలు కేంద్రాల ఏర్పాటు - అదనపు కలెక్టర్ వీరారెడ్డి

**-రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పెసర్ల కొనుగోలు సెంటర్లను వినియోగించుకోవాలి**

**-క్వింటాల్ ధర రూ. 7,755/-**

సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (నేటి నిజం ప్రతినిది): జిల్లాలో మూడు పెసర్ల కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అదనపు కలెక్టర్ వీరారెడ్డి తెలిపారు. గురువారం వ్యవసాయ, మార్క్ఫెడ్ మార్కెటింగ్, సహకార శాఖల అధికారులతో పెసర పంట కొనుగోలు ఏర్పాట్లపై సమీక్షించారు. జిల్లాలో రైతులు 13,175 ఎకరాలలో పెసర పంట వేసారని, సుమారు 39,520 క్వింటాళ్ల పెసర్లు వచ్చే అవకాశమున్నట్లు అంచనా ఉందన్నారు. మార్క్ ఫెడ్ ఆధ్వర్యంలో నారాయణఖేడ్, రాయికోడ్, జహీరాబాద్ వ్యవసాయ మార్కెట్ కమిటీలలో ఈ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. కొనుగోలుకు సంబంధిత అధికారులు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లతో సన్నద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం పెసర్లకు క్వింటాల్ కు 7,755/- రూపాయల మద్దతు ధర ప్రకటించిందన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన టార్పాలిన్లు, తేమను కొలిచే యంత్రాలు, డిజిటల్ కాంటాలు, అవసరమైనన్ని కొత్త గన్ని బ్యాగులు అందుబాటులో ఉంచాలని మార్కెటింగ్ అధికారికి సూచించారు. పెసర్లు పండించిన రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగునంగా ఉన్న పెసర్లను తమ వ్యవసాయ విస్తరణ అధికారితో ధృవీకరించుకుని కొనుగోలు కేంద్రాలను తీసుకురావాలని తెలిపారు. ఈ విషయమై రైతులకు అవగాహన కల్పించాలని వ్యవసాయ అధికారికి సూచించారు. జిల్లాకు 10,990 క్వింటాళ్ల పెసర్లు కొనుగోలు లక్ష్యంగా ఉందన్నారు. ముందస్తుగా గోడౌన్లను గుర్తించాలని, రవాణా ఏర్పాట్లను చేయాలని మార్క్ ఫెడ్ అధికారి కి సూచించారు.అవసరమైతే అదనంగా కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి సిద్ధంగా ఉండాలని సూచించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఆయా శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో మార్క్ఫెడ్ అధికారి శ్రీదేవి, వ్యవసాయ శాఖ ఏడిఏ పద్మ, సహకార, మార్కెటింగ్ తదితర శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.



# జీవనశైలి మార్పులతో గుండె భద్రం

## -డా॥ బంగారి స్వామి, యం. డి. రెనీ ఆసుపత్రి

హైదరాబాద్, సెప్టెంబర్ 29: ఆధునిక ఒత్తిడితో కూడిన వేగవంతమైన సమాజంతో వయస్సుకు




నిమిత్తం లేకుండా గుండె సంబంధ జబ్బులు పెరుగుతున్నాయని, ప్రజలు తమ గుండెను పదిలపరుచుకోవడానికి జీవనశైలిలో సానుకూల మార్పులు చేసుకోవాలని రెనీ ఆసుపత్రి అధిపతి ప్రముఖ ఎముకల వైద్యులు లయన్. డా: బంగారి స్వామి అన్నారు. ఈ రోజు శాతవాహన లయన్స్ క్లబ్ సమన్వయంతో రెనీ ఆసుపత్రి నిర్వహించిన రూ: 499/-కే పూర్తి గుండె పరీక్షలు, వైద్యుల సలహాల కార్యక్రమాన్ని కేక్ కట్ చేసి ప్రారంభించారు. 29 సెప్టెంబర్‌న ప్రపంచ హృదయ దినం సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ పరిమితమైన పోషకాహారం తీసుకోవడం, నిత్యం వ్యాయామం చేయడం, మంచి నిద్ర, చెడు అలవాట్లకు దూరంగా ఉండడంతో పాటు ఒత్తిడి లేని జీవన విధానాన్ని అలవర్చుకున్న వారికి గుండె జబ్బులు రాకుండా ఉంటాయని తెలిపారు. రెనీ ఆసుపత్రి స్త్రీ వైద్య నిపుణులు డా: రజనీ ప్రియదర్శిని మాట్లాడుతూ గుండె సంబంధ సమస్యలు భారత్‌లో అధికంగా ఉంటున్నాయని, వ్యాధి రాకుండా తగు ప్రతి ఒక్కరు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గుండె సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలు సానుకూల జీవనశైలితో తమ జీవితకాలాన్ని పొడిగించుకోవాలని సూచించారు. ఈ ప్రారంభ కార్యక్రమంలో పూర్వ జిల్లా గవర్నర్ రొండా వేణుమూర్తి దంపతులతో పాటు గుండె జబ్బుల వైద్యులు డా: దినకర్ పాల్గొని లయన్స్‌కు గుండె సంబంధ ఈసిజి, ఎకో 2డి పరీక్షలు చేసి తగు సలహాలు ఇచ్చారు. పాల్గొన్న వారికి డైటీషియన్ ఆహార అలవాట్లను వివరించారు. పరీక్షలు నిర్వహించిన డా: దినకర్ నేతృత్వంలో అందరికీ సలహాలు, సూచనలు చేశారు. శాతవాహన లయన్స్ క్లబ్ అధ్యక్షులు డా మనోహరా చారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా గ్లోబల్ లీడర్‌షిప్ కోఆర్డినేటర్ లయన్ డా: బుర్ర మధుసూదన్ రెడ్డి, ఆర్‌సి ఈ. రమేష్, జడ్‌సి వి జగదీశ్వరాచారి, కార్యదర్శి కార్యక్రమ సమన్వయకర్త యం. అరవింద్ రావు, డి. తిరుపతి రెడ్డి, యం. మహేందర్, యస్. తిరుపతి రెడ్డిలతో పాటు రెనీ ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# బాల్యవివాహాల్లో దేశంలో 12వ స్థానంలో తెలంగాణా

## - తెలంగాణలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా కైలాష్ సత్యార్థి చిల్డ్రన్స్ ఫౌండేషన్ సంప్రదింపులు

హైదరాబాద్, సెప్టెంబర్ 29: నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కైలాష్ సత్యార్థి వారి కైలాష్ సత్యార్థి చిల్డ్రన్ ఫౌండేషన్ (కెయస్‌సియఫ్ -




35 నుండి 2021లో 57 పెరిగింది. భారతదేశంలో 20–24 సంవత్సరాల మధ్య వయస్సు గల స్త్రీలలో 23.3% మంది 18 సంవత్సరాల కంటే ముందే వివాహం చేసుకున్నారని ఔఈఊఖా-ఎ డేటా నివేదిస్తుంది. అయితే, తెలంగాణలో అదే వయస్సులో ఉన్న స్త్రీలలో 18 ఏళ్లలోపు వివాహం చేసుకున్నవారు 23.5% మంది ఉన్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం, తెలంగాణలో 2.8 లక్షల

ఖూఅఈ) తాము త్వరలో ప్రారంభించబోయే "బాల్య వివాహ రహిత భారతదేశం'' ప్రచారకార్యక్రమాన్ని హైదరాబాద్‌లో ప్రకటించింది. బాల్య వివాహ రహిత భారతదేశం సాకారం కావడానికి పిల్లల రక్షణకు సంబంధించిన అన్ని రకాల సంస్థలను ఏకతాటిపైకి తీసుకురావడానికి నిర్వహించిన రాష్ట్ర సంప్రదింపులో ఇది ప్రకటించబడింది. కెయస్‌సియఫ్ మరియు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ తో కూడి ఈ సంప్రదింపులను నిర్వహించింది. భారతదేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చేందుకు దేశవ్యాప్తంగా నిరంతర ప్రచారం కోసం కైలాష్ సత్యార్థి ఇటీవల ఇచ్చిన పిలుపును అనుసరించి కెయస్‌సియఫ్ దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలలో ఈ సంప్రదింపులను ప్రారంభించింది. రాష్ట్ర స్థాయి సంప్రదింపులలో బాల్య వివాహాల నిషేధ అధికారి నియామకం, బాల్య వివాహాల కేసులలో తప్పనిసరి ఎఫ్ఐఆర్




నమోదు మరియు వారి తక్కువ వయస్సు ఉన్న పిల్లలకు వివాహం చేయకుండా తల్లిదండ్రులను ప్రోత్సహించడం వంటి కీలక అంశాలు చర్చించబడ్డాయి. ఈ సందర్భంలో, తెలంగాణ రాష్ట్రం చాలా ప్రాముఖ్యతను సంతరించుకుంది. 2019-21 జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే-ఎ నివేదిక ప్రకారం, గత 3 సంవత్సరాలలో, తెలంగాణలో బాల్య వివాహాల బాధితుల సంఖ్య నిరంతరం పెరుగుతోంది. 2019లో మంది పిల్లలకు చట్టబద్ధమైన వివాహ వయస్సు రాకముందే వివాహం జరిగింది, ఇది దేశంలోని వివాహిత పిల్లల్లో దాదాపు 2 శాతం మందిగా ఉంది. ఈ సందర్భంగా కెయస్‌సియఫ్ ప్రతినిధులతో పాటు, తెలంగాణాలో ఈ రంగంలో పనిచేస్తున్న వివిధ సామాజిక సంస్థలు, కార్యకర్తలు, విద్యాసంస్థల ప్రతినిధులు, న్యాయరంగ నిపుణులు, ఉన్నత స్థాయి ప్రభుత్వ మరియు పోలీసు అధికారులు తదితరులు ఈ సదస్సులో పాల్గొన్నారు.

# దాదాపు 67% మంది భారతీయులకు వైద్య భీమా లేకపోవడంతో క్రౌడ్ ఫండింగ్‌ను వారు ఆధారపడతగిన అవకాశంగా భావిస్తున్నారని గమనించిన మిలాప్

హైదరాబాద్, సెప్టెంబర్ 29: క్రౌడ్‌ఫండింగ్ ఇప్పుడు ఆధారపడతగిన అవకాశంగా ఎక్కువ మంది చూస్తున్నారిప్పుడు, దీనికి 67% మంది భారతీయులకు వైద్య భీమా లేకపోవడం ఓ కారణం అని మిలాప్ వెల్లడించింది. భీమా కవరేజీ ఉన్నప్పటికీ, వైద్యపరంగా ఖర్చులు చాలామందికి ఆర్థికంగా భారంగా ఉన్నాయి. ఆఖరకు ప్రభుత్వ భీమా పథకాలు పొందడం కూడా సామాన్య ప్రజలకు కష్టంగానే ఉందని మిలాప్ వెల్లడించింది. ప్రతి ఏటా భారతదేశంలో 5.5 మిలియన్ల మంది అప్పుల్లో కూరుకుపోవడానికి ఊహించని వైద్య ఖర్చులు కారణమవుతున్నాయి. 2022 సంవత్సరంలోనే భారతదేశంలో ప్రజా ఆరోగ్యం కోసం జీడీపీలో దాదాపు 1.6% ఖర్చు చేసినట్లు అంచనా. ఇటీవల నిర్వహించిన ఓ అధ్యయనంలో భారతదేశంలో ఐసీయులో చేరిన రోగికి అయ్యే సరాసరి ఖర్చు రోజువారీ కార్మికుని 16 నెలల జీతంతో సమానంగా, అలాగే ఓ సగటు ఉద్యోగి 10 నెలల జీతంతో సమానంగా ఉందని మిలాప్ వెల్లడిచించింది. ప్రజలు తరచుగా ఇటీవలి కాలంలో ఆన్‌లైన్ క్రౌడ్ ఫండింగ్‌ను తమ చివరి అవకాశంగా వినియోగించుకుంటున్నారు. తద్వారా తమ వైద్య ఖర్చులకు చెల్లింపులనూ చేస్తున్నారని మిలాప్ వెల్లడించింది. మిలాప్ లాంటి వేదికలు నిధుల సేకరణ వేదికలుగా ఉపయోగపడటంతో పాటుగా దాతలలో విశ్వసనీయతనూ పొందుతున్నాయి. భారతదేశపు వైద్య సంరక్షణ వ్యవస్థ భవిష్యత్ లో క్రౌడ్ ఫండింగ్‌కు ఎక్కువ అవకాశాలున్నాయని మిలాప్ వెల్లడిస్తూ తమ ప్లాట్‌ఫామ్‌పై 72 లక్షల ఖాతాలున్నాయని వెల్లడించింది. దేశీయంగా 46 లక్షల మంది దాతలు ఉండగా, విదేశాలలో లక్షల మంది దాతల ఉన్నారని వెల్లడించింది. "డబ్బుకోసం స్నేహితులు, కుటుంబసభ్యులను అడిగి కష్టపడుతున్న ఎంతోమంది ఇప్పుడు క్రౌడ్‌ఫండింగ్ అతి సులభమైన అవకాశంగా గుర్తిస్తున్నారు. మా ప్లాట్‌ఫామ్ పారదర్శక, సౌకర్యవంతమైన అనుభవాలను అందించడంతో పాటుగా డిజిటల్‌గా దానం చేసే అవకాశం కల్పిస్తుంది" అని అనోజ్ విశ్వనాథన్, ప్రెసిడెంట్, కో?ఫౌండర్, మిలాప్ అన్నారు. మిలాప్‌పై 90% ఫండ్‌రైజర్లు వైద్య విభాగానికి చెందినవి ఉంటున్నాయని ఆయన వెల్లడించారు. ఎవరైనా మిలాప్‌పై ఫండ్ రైజర్ ప్రారంభించవచ్చంటూ ఇప్పటి వరకూ 2 లక్షల మెడికల్ క్యాంపెయ్నును మిలాప్‌పై చేయడం ద్వారా 1250 కోట్ల రూపాయలను సేకరించి 3.8 లక్షలమందికి ప్రయోజనం కలిగించడం జరిగిందని మిలాప్ వెల్లడించింది.

# మిషన్ భగీరథ వాటర్ ట్యాంకర్‌కు శంకుస్థాపన



మహబూబాబాద్, సెప్టెంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండలం చిన్న వంగర గ్రామంలో డబుల్ బెడ్ రూముల పక్కన మిషన్ భగీరథ వాటర్ ట్యాంకర్ ను నిర్మించుట కొరకు స్థానిక గ్రామ సర్పంచ్ జలగం లక్ష్మి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఈ ఎండి యాకూబ్ పాషా, వర్క్ ఇన్స్పెక్టర్ అబ్బాస్ , టిఆర్ఎస్ మండల నాయకుడు పాకనాటి ఉపేందర్ రెడ్డి, నాయకులు జలగం శేఖర్, విద్యా కమిటీ చైర్మన్ జలగం యాకయ్య, యాసారపు వెంకటయ్య, శివరాత్రి యాకయ్య, మాజీ విద్యా కమిటీ చైర్మన్ దేవా, యాసారపు వీరయ్య, కొమ్ము వెంకన్న, జలగం ఐలయ్య, జలగం ప్రభాకర్ , గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

# గ్రంథాలయ సంస్థ చైర్మన్ అనీల్‌ను అభినందించిన గులాం అహ్మద్



కరీంనగర్, సెప్టెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ జిల్లా గ్రంధాలయ సంస్థ చైర్మన్గా పదవీ ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం అనిల్ కుమార్ గౌడ్ ను గురువారం ఎంఐఎం పార్టీ నగర అధ్యక్షుడు, తెలంగాణ హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ పుష్పగుచ్ఛం అందించి శాలువా కప్పి ఆత్మీయంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి ఉన్నారు.

# ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా సహాయ చర్యలు చేపట్టాలి : మంత్రి శ్రీనివాస్ గౌడ్

మహబూబ్‌నగర్, సెప్టెంబర్ 29: భారీ వర్షాల ప్రభావం వల్ల మహబూబ్ నగర్ లోతట్టు ప్రాంతాల్లో ఎప్పటికప్పుడు పరిస్థితిని పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చూడాలని ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించారు.

గురువారం మహబూబ్‌నగర్‌లో సుమారు మూడు గంటల పాటు కుండపోత వర్షం కురిసింది. కాగా, సమాచారం తెలిసిన వెంటనే మంత్రి అధికారులను అప్రమత్తం చేశారు. 36వ జాతీయ క్రీడల ప్రారంభోత్సవ కార్యక్రమానికి గుజరాత్ లోని అహ్మదాబాద్ వెళ్లిన రాష్ట్ర క్రీడల శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అక్కడి నుంచే పరిస్థితిని సమీక్షించారు.

లోతట్టు ప్రాంతాలైన రామయ్య బౌలి, బికె రెడ్డి కాలనీ, వల్లభ్ నగర్, శివశక్తి నగర్ తదితర ప్రాంతాల్లో అడిషనల్ కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ వెంకటేశ్వర్లు, మున్సిపల్ చైర్మన్ కేసీ నర్సింహులు, మున్సిపల్ కమిషనర్ ప్రదీప్, అగ్నిమాపక, మున్సిపల్, పోలీస్ సిబ్బంది మంత్రి ఆదేశాలతో హుటాహుటిన లోతట్టు ప్రాంతాలకు వెళ్లి పరిస్థితిని పరిశీలించారు.

ఒక్కసారిగా 10 నుంచి 15 సెంటీమీటర్ల వర్షపాతం కురవడం వల్లే ఎగువ నుంచి భారీగా వర్షపు నీరు వచ్చిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. సిబ్బంది నిరంతరం లోతట్టు ప్రాంతాల కాలనీ ప్రజలకు అందుబాటులో ఉండి ఎలాంటి సమస్య లేకుండా చూడాలన్నారు.

# ఏడాదిగా స్టీల్ స్పూన్లు తింటున్న వ్యక్తి- ఆపరేషన్ చేసి 62 స్పూన్లు తొలగించిన డాక్టర్లు

లక్నో, సెప్టెంబర్ 29: ఒక వ్యక్తి ఏడాదిగా స్టీల్ స్పూన్లు తింటున్నాడు. కడుపు నొప్పితో ఆసుపత్రిలో చేరాడు. దీంతో డాక్టర్లు ఆపరేషన్ చేసి అతడి కడుపు నుంచి 62 చెంచాలు తొలగించారు. ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లాలో ఈ సంఘటన జరిగింది. బొప్పాడ గ్రామానికి చెందిన 32 ఏళ్ల విజయ్ ఇటీవల తీవ్ర కడుపు నొప్పితో బాధపడ్డాడు. దీంతో కుటుంబ సభ్యులు అతడ్ని ముజఫర్‌నగర్ ఆసుపత్రిలో అడ్మిట్ చేశారు. విజయ్‌ను పరీక్షించిన వైద్యులు, అతడి కడుపులో స్టీల్ స్పూన్లు ఉన్నట్లు ఎక్స్ రే ద్వారా గుర్తించారు. దీంతో ఆపరేషన్ చేసి అతడి కడుపు నుంచి 62 స్పూన్లు బయటకు తీశారు.

కాగా, స్పూన్లు తింటున్నావా అని విజయ్‌ను డాక్టర్లు అడిగారు. గత ఏడాదిగా తాను చెంచాలు తింటున్నట్లు అతడు చెప్పాడని డా. రాకేష్ ఖురానా మీడియాకు తెలిపారు. సుమారు రెండు గంటలపాటు సర్జరీ చేసి విజయ్ కడుపులో ఉన్న 62 స్టీల్ స్పూన్లను బయటకు తీసినట్లు చెప్పారు. ప్రస్తుతం అతడు ఐసీయూలో ఉన్నాడని ఆయన వెల్లడించారు. మరోవైపు ఇటీవల రాజస్థాన్‌లో కూడా ఇలాంటి సంఘటన జరిగింది. జోధ్‌పూర్‌కు చెందిన 36 ఏళ్ల వ్యక్తి తీవ్ర మనస్థాపంతో 63 రూపాయి నాణేలు మింగాడు. అనారోగ్యానికి గురికావడంతో రెండు రోజులపాటు ఆపరేషన్ చేసిన డాక్టర్లు ఆ వ్యక్తి కడుపు నుంచి 63 నాణేలను బయటకు తీశారు.

# కృష్ణ, మహేశ్ బాబుకు చిరంజీవి పరామర్శ

హైదరాబాద్, సెప్టెంబర్ 29: సతీమణి, మహేశ్ బాబు తల్లి ఇందిరాదేవి బుధవారం తుది శ్వాస విడిచిన విషయం తెలిసిందే. ఇందిరాదేవి మృతి పట్ల సినీ, రాజకీయ ప్రముఖులు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఘట్టమనేని కుటుంబ సభ్యులకు సంతాపం తెలియజేస్తున్నారు. బుధవారం ఇందిరాదేవికి నివాళులు అర్పించేందుకు పద్మాలయ స్టూడియోస్ వెళ్లలేకపోయిన చిరంజీవి (అఫ్రతీజీనితీవవలతి)ఇవాళ కృష్ణ నివాసానికి వెళ్లారు. కృష్ణ, మహేశ్ బాబును పరార్శించారు చిరంజీవి . కృష్ణకుటుంబసభ్యులను ఓదార్చి వారికి భరోసానిచ్చారు. మంత్రి తలసాని శ్రీనివాస్ ఇప్పటికే ఫిల్మ్ నగర్ లోని నివాసంలో కృష్ణ కుటుంబసభ్యులను పరామర్శించి.. వారిని ఓదార్చారు. జూబ్లీహిల్స్ లోని మహాప్రస్థానంలో బుధవారం మధ్యాహ్నం సినీ, రాజకీయ ప్రముఖుల సమక్షంలో ఇందిరాదేవి అంత్యక్రియలు ముగిశాయి.

# పట్టణ అభివృద్ధే లక్ష్యం

## -మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపుమాధవి రాజు




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29: (నేటినిజం ప్రతినిధి): పట్టణ అభివృద్ధే లక్ష్యంగా వేములవాడ మున్సిపాల్టీ ముందుకు సాగుతుందని వేములవాడ మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థ పు మాధవి రాజు అన్నారు .గురువారంవేములవాడ మున్సిపల్ ఆఫీస్ లో మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి రాజు అధ్యక్షతన సెప్టెంబర్ 2022 మాత్రం కౌన్సిల్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు . ఈ సమావేశంలో భాగంగా 19ఎజెండా అంశాలపై పాలకవర్గ సభ్యులతో ' కోఆప్షన్ సభ్యులతో చర్చించి ఇట్టి అంశాలను పాలకవర్గ సమావేశంలో ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ వ ా ట ్ల ా డ ు త ూ మున్సిపాలిటీకి జాతీయస్థాయిలో స్వచ్ఛత అవార్డు రావడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నామని ఇందుకు సహకరించిన మంత్రి కెటిఆర్ ,ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు , వైస్ చైర్మన్ మధు రాజేందర్ ,కమిషనర్ శ్యాంసుందర్ రావు ,పారిశుధ్య కార్మికులకు,కౌన్సిలర్లకు ధన్యవాదాలు తెలిపారు . పాలకవర్గసభ్యుల , ప్రజల సహకారం వల్లే మనకు జాతీయస్థాయిలో స్వచ్ఛత అవార్డు రావడం జరిగిందని అక్టోబర్ 1 న భారత ప్రెసిడెంట్ చేతుల మీదగా స్వచ్ఛత అవార్డు తీసుకోవడం జరుగుతుందని మనకు అవార్డు రావడానికి కృషి చేసిన మున్సిపల్ సానిటేషన్ పారిశుద్ధ కార్మికుల పాత్ర కీలకమని వారిని అభినందించారు .పట్టణంలోని పలువురు కౌన్సిలర్ పలు సమస్యలు అధ్యక్షురాలు దృష్టికి తీసుకుని రాగాసమస్యలు వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే శనివారం రోజున సద్దుల బతుకమ్మ పండుగ ఉన్నందున వార్డులలో లైట్లు లేని చోట లైటింగ్ బిగించి బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో శానిటేషన్ పరంగా క్లీన్ చేయాలని చైర్ పర్సన్ ని కోరగా చైర్ పర్సన్ వెంటనే అధికారులను సిబ్బందిని బతుకమ్మ ఆడే ప్రదేశాల్లో మహిళలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా లైటింగ్ మరియు చెత్తాచెదారం తొలగించి క్లీన్ గా చేయాలని అధికారులను సిబ్బందిని ఆదేశించారు. ఈ సందర్భంగా పట్టణంలో మున్సిపల్ నుండి చేయబోయే పలు అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చించారు. ఈ సమావేశంలో ఇన్చార్జి కమిషనర్ సంపత్ రెడ్డి డి ఈ తిరుపతి ,ఎ .ఈ నరసింహస్వామి , పాలకవర్గ సభ్యులు , కోఆప్షన్సభ్యులు,మున్సిపల్ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ముంపు గ్రామాల ప్రజల త్యాగం వెలకట్టలేనిది!

## -సంకెపల్లి, ఆరెపల్లి 190 మంది నిర్వాసితులకు రు.25 కోట్ల చెక్కులు పంపిణీ.
## -90 మందికి యిండ్ల పట్టాల పంపిణీ.
## - శాసనసభ్యులు చెన్నమనేని రమేష్




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 29 (నేటినిజం ప్రతినిధి): ముంపు గ్రామాలనిర్వాసితులకు ఎన్ని వందల కోట్లు ఇచ్చిన వారి త్యాగం వెల కట్టలేనిది అని ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్ బాబు అన్నారు .గురువారంవేములవాడ అర్బన్ మండలం సంకెపల్లి గ్రామంలో నూతన గ్రామపంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించి, అనంతరం సంకెపల్లి పాఠశాల భవనం సమీపంలో నిర్వహించిన సభలో సంకెపల్లి, ఆరెపల్లి గ్రామానికి చెందిన మిడ్ మానేరు నిర్వాసితులైన 190 మందికి దాదాపు 25 కోట్ల రూపాయలతో నష్టపరిహార చెక్కులతో పాటు 90 ఇండ్ల పట్టాలను నిర్వాసితులకు అందజేసారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఎమ్మెల్యే రమేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ముంపు గ్రామాల మిగిలి వున్న ప్రజలసమస్యలను త్వరితగతిన పరిష్కరిస్తుందని హామీ ఇచ్చారు. కొంత ఆలస్యం అయినప్పటికీ అందరికీ న్యాయం చేస్తామన్నారు. తాను ఎమ్మెల్యేగా ఎన్నికైన తర్వాత ప్రధానమైనటువంటి సమస్యలు ఒకటి మిడ్ మానేరు, ముంపు గ్రామాల సమస్య, ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన రాజరాజేశ్వర స్వామి వారి ఆలయ అభివృద్ధి , కలికోట సూరమ్మ ప్రాజెక్టు చెరువు పనులను పూర్తి చేయాలని లక్ష్యం పెట్టుకున్నానని దానికి అనుగుణంగానే ప్రభుత్వంతో మాట్లాడి తన సాయశక్తుల కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు. 2017లో సంకెపల్లి ముంపు గ్రామంగా ప్రకటించడంలో హరీష్ రావు పాత్ర ఎనలేనిదన్నారు. మిగిలిన 45 ఇండ్ల సమస్యను మంత్రి కే.టీ.ఆర్ దృష్టికి తీసుకురావడం జరిగిందని ఈ సమస్య కూడా త్వరలో పరిష్కారము కానున్నదన్నారు. ఈ 25 కోట్ల మంజూరీకి సహకరించిన మంత్రి కే.టీ.ఆర్ కి ఈ సభ ద్వారా ధన్యవాదాలు తెలిపారు. మీరు సొంత గ్రామాలను వదులుకోవడం ఒక పక్క బాధ, మరో పక్క మీ త్యాగం వల్ల యిక్కడ నిర్మించిన ప్రాజెక్ట్ ద్వారా వేలాది ఎకరాలు సాగులోకి రావడం సంతోషం అన్నారు. సీ.ఎం కేసీఆర్ వారి కన్నీళ్లు తుడవడానికి కృత నిశ్చయంతో ఉన్నారన్నారు. మిడ్ మానేరు నిర్వాసితుల యువత కోసం ప్రత్యేకంగా పరిశ్రమలను ఏర్పాటు చేసి నిరుద్యోగ సమస్యను తీర్చేందుకు ప్రత్యేక ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు తెలిపారు. రు. 700 కోట్లతో యిధనాల్ ప్రాజెక్ట్ రాబోతున్నది అని దీనితో ప్రత్యక్షం వెయ్యి మందికి, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కలగబోతున్నదన్నారు. త్వరలోనే మిగిలిపోయిన నిర్వాసితులు సమస్యల పరిష్కారానికి కూడా రాష్ట్ర ప్రభుత్వం ద్వారా పూర్తి పరిహారాన్ని స్థానిక జిల్లా మంత్రి కేటీఆర్ సహకారంతో అందిస్తానని హామీ ఇచ్చారు.. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మ్యాకల రవి, ఎంపీపీ బూర వజ్రమ్మ బాబు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు, సంకెపల్లి, ఆరెపల్లి సర్పంచులు జింక సునీత-వేణు , ఇటిక్యాల రాజు-నవీన, ఎంపీటీసీలు టిఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ముంపు గ్రామాల నిర్వాసితులు పాల్గొన్నారు..

# ఏస్, ట్రాక్టర్ షైన్ శ్రేణి కోసం నూతన ప్రచార కార్యక్రమాన్ని ప్రారంభించిన ఏషియన్ పెయింట్స్




హైదరాబాద్, సెప్టెంబర్ 29: ప్రతీ ఇంటి యజమాని కూడా తన వ్యక్తిత్వాన్ని, తన ప్రాథమ్యాలను చాటిచెప్పేలా తన ఇంటిని అలంకరించుకోవాలని భావిస్తుంటారు. కొనుగోలుదారులు చాలా మంది షైనీ ఫినిష్ కావాలని కోరుకుంటూ ఉంటారు, కాకపోతే అదెంతో ఖరీదైనదని, ప్రీమియం ఉత్పాదన అని అపోహపడుతుంటారుఅని ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ అమిత్ సింగ్లే అన్నారు. ఈ ఆలోచనతోనే ఇప్పుడు ఏషియన్ పెయింట్స్, అందుబాటు ధరల్లోనే లభ్యమయ్యే తన ట్రాక్టర్ షైన్ ఏస్ షైన్ తన నూతన ప్రచార కార్యక్రమంపైవెలుగులు ప్రసరిస్తోంది. ఈ పెయింట్లు వినియోగదారులకు దీర్ఘకాలం పాటు మెరుపును సహేతుక ధరకే అందిస్తాయని తెలిపారు. ఒగ్గీవీ ఇండియాచే రూపకల్పన చేయబడిన ఈ టీవీసీ ప్రత్యేకించి దక్షిణ భారతదేశ మార్కెట్ కోసం రూపొందించబడింది. ఇందులో మనం మిస్టర్ బాలా స్టోరీని చూడవచ్చు. ప్రముఖ నటుడు, కమెడియన్ బడవ గోపి ఈ పాత్రను పోషించారు. ఆయన ఇల్లు ఏషియన్ పెయింట్స్ ట్రాక్టర్ షైన్, ఏస్ షైన్ ఎమల్షియన్స్‌హోతో పెయింట్ చేయబడిన నేపథ్యంలో ఇది కొనసాగుతుంది. ఆ గోడల మెరుపు ఆయన ముఖంపై గర్వంగా ప్రతిఫలిస్తుంది. తన ఇల్లు ఎంత విలాసవంతంగా ఉందో అంటూ మురిసిపోతాడు. "షైనీ వాల్ ఫినిష్ అనేది సాధారణంగా ప్రీమియంతో ముడిపడి ఉంటుంది, కాకపోతే అందుబాటు ధరలోనూ అది లభిస్తుంది" అనే కీలక సందేశం వినియోగదారులను ఆకర్షిస్తుందని అమిత్ సింగ్లే అభిప్రాయపడ్డారు. ఇంటి యజమానులు పండుగ సందర్భంగా తమ ఇంటి గోడలను తిరిగి అలంకరించాలనుకున్నప్పుడు, తమ గదులకు మరింత మెరుపును జోడించాలనుకున్నప్పుడు ఏషియన్ పెయింట్స్ అందించే ట్రాక్టర్ ఎమిల్షియన్, ఏస్ షైన్ పెయింట్స్‌హోకు మించినవి మరొకటి లేవు. ఏషియన్ పెయింట్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ అమిత్ సింగ్లే ఈ సందర్భంగా తన ఆలోచనలను పంచుకుంటూ, "ఇళ్లు ఆయా వ్యక్తుల వ్యక్తిత్వాలను, అభిరుచులను ప్రతిబింబిస్తాయి.

# ఏపీలో సమ్మెబాట పట్టిన ఆడిట్ ఉద్యోగులు

అమరావతి, సెప్టెంబర్ 29: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆడిట్ ఉద్యోగులు సమ్మెలోకి దిగనున్నారు. తమ సమస్యల పరిష్కారం కోసం వారు గురువారం సమ్మె నోటీసు ఇచ్చారు. స్టేట్ ఆడిట్ డైరెక్టర్‌ను కలిసిన ఉద్యోగులు ఈ మేరకు సమ్మె నోటీసును అందజేశారు.

చాలా కాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యల పరిష్కారం కోసం ఏపీ ఆడిట్ ఉద్యోగులు సమ్మె బాట పట్టనున్నారు. ఆడిట్ ఉద్యోగుల్లో క్యాటగిరీల వారీగా గ్రేడింగ్ విధానాన్ని రద్దు చేయాలని వారు కోరుతున్నారు. జిల్లాల విభజనకు ముందున్న మాదిరిగానే డివిజన్ ఆఫీసులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పాత విధానంలోనే వర్క్ అలాట్‌మెంట్ ఉండాలని వారు కోరుతున్నారు

# ఐదవ రోజు ఘనంగా కలెక్టరేట్ ఆవరణలో అట్ల బతుకమ్మ నిర్వాహణ



సంగారెడ్డి, సెప్టెంబర్ 29 (నేటి నిజం ప్రతినిది): బతుకమ్మ సంబరాల్లో భాగంగా ఐదవ రోజైన గురువారం సంగారెడ్డి కలెక్టరేట్ ఆవరణలో జిల్లా ప్రజా పరిషత్ ఆధ్వర్యంలో అట్ల బతుకమ్మ ను ఘనంగా నిర్వహించారు. జిల్లా ప్రజా పరిషత్ మహిళా ఉద్యోగులు, కలెక్టరేట్ లోని వివిధ శాఖల మహిళా అధికారులు, ఉద్యోగులు, కాలనీ వాసులు, పాల్గొన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.